హైదరాబాద్ వార్త



# ఏది తినాలన్నా..కల్తీ కల్తీ

**-పాలప్యాకెట్ నుంచి అల్లంపేస్ట్ వరకు అన్నింట్లో నకిలీలు**
**-హోటళ్లు, పాస్ట్‌ఫుడ్‌సెంటర్లలో నాసిరకం నూనెలు**
**-మరిగించిన నూనెలను మళ్ళీ మళ్ళీ వాడకం**
**-అనారోగ్యంతో ఆసుపత్రుల పాలవుతున్న ప్రజలు**





**హైదరాబాద్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** నగరంలో కల్తీ ఆహారం కారణంగా ఆస్పత్రులకు వెళ్లేవారి సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతుంది. జిహెచ్ఎంసితోపాటు ఏప్రభుత్వ విభాగం దీనిపై శ్రద్ధ చూకపోవడంతో నగరంలో కల్తీకి అడ్డుకట్ట పడటం లేదు. అన్నిరంగాల్లో ముందంజలో నిలుస్తున్న హైదరాబబాద్ నగరం కల్తీలో కూడా నెంబర్‌వన్‌గా మారనుందా అనే అనుమానాలు తలెత్తున్నాయి. ముఖ్యంగా ప్రజా ఆరోగ్యంతో ముడిపడి ఉన్న నిత్యావసర వస్తులవును సైతం కృత్రిమంగా తయారు చేసి విక్రసిస్తున్నారు. హైడ్రోజన్ ఫెరాక్సైడ్ వంటి కెమికల్స్‌ను కలిపి తయారు చేస్తున్నారు. అల్లం, కారం, పసుపు, జిలకర్ర, సా జిర, బాదం, లవంగాలు, ఇలాచీలు, గసగసాలు, మిర్యాలు ..ఇలా ఒకటేంటి ఇంటిలోని వంటగదిలో ఉండే ఆహార పదార్థాల తయా రీకి ఉపయోగించే వన్నీ నకిలీవి తయారు చేస్తున్నారు. కారంలో కృతిమ రంగు, ఇటుకపొడి, రంపం పొట్టు, సపోట విత్తనాలు, బట్టల సోడాతో చెక్కెర, కుళ్ళిన అరటిపండ్ల గుజ్జు, అలుగడ్డలు వేసి అల్లం పేస్ట్ వంటివి కలుపుతున్నారు. అలాగే వంటల్లో వాడే నూనెల్లో చనిపోయిన పందులు, పశువులు, ఇతర జంతువుల కళేబరాల నుంచి నూనెలను తయారు చేస్తున్నారు. అలాగే చిన్న పిల్లలు తాగే పాలు సైతం కృత్రిమంగా తయారు చేస్తున్నారు. యూరియా, సర్ఫ్ తదితర మిశ్రమాలను కొద్దిశాతం పాలలో కలిసి విక్రయిస్తున్నారు. ఇలా నగర శివారు ప్రాంతాలను అడ్డాలుగా చేసుకుని కల్తీ సరుకులను యథేచ్ఛగా తయారు చేసి మార్కెట్‌లోకి విడుదల చేస్తున్నారు. ముఖ్యంగా పాతబస్తీ, కాటేదాన్, శంషాబాద్, జల్‌పల్లి, పటాన్‌చెర్వు, బాలాపూర్, పహాడీ షరీఫ్, మీర్‌పేట్, రాజేంద్రనగర్, జీడిమెట్ల తదితర ప్రాంతల్లో గోదాములను ఏర్పాటు చేసుకుని ఈదందాలకు పాల్పడుతున్నారు.

**మరిగించిన నూనెతోనూ ముప్పే..**

నగరంలో ఏవీధిలో చూసినా హోటళ్లు, బేకరీలు, ఫాస్ట్ ఫుడ్,టిఫిన్ సెంటర్ల కు కొదవ లేదు. తీరిక లేని సమయా ల్లో వారాం తాల్లో చాలామంది ఆహార ప్రియులు వీటిని లొట్టలేసుకుని మరీ తింటున్నారు. వంటనూనెలను నాలుగైదు సార్లు వాడటం, శుభ్రత పాటించకపోవడం, నకిలీ నూనెలు వాడటం వంటివి చేస్తున్నారు. దీంతో అక్కడ తిన్న వినియోగదారులు ఆసుపత్రుల పాలవుతున్నారు. నూనెను ఎక్కువసార్లు మరింగించడం వల్ల అందులోని టోటల్ కాంపౌండ్స్ (టిపిసి)ఫ్రీరాడికల్స్‌గా మారుతాయని వైద్యులు తెలుపుతున్నారు. సాధారణంగా వంటనూనెలో పోలార్ కాపౌండ్స్ 25శాతానికి మించేతే దాన్ని మార్చాలని ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్స్ అథారిటీ ఆఫ్ ఇండియా నిబంధనలు చెబుతున్నాయన్నారు. కానీ దాదాపు అన్ని హోటళ్లలో మోతాదుకు మించి హానిక రమైన ఫుడ్‌కలర్స్, టేస్టింగ్ సాల్ట్, సోయా సాస్‌ల ను వినియోగిస్తున్నారు. దీంతో కల్తీ ఆహారం తీసుకోవడం వల్ల రక్తనాళాలు గట్టిపడటం, ఆల్జీమర్స్, కాలేయ,గుండె సంబంధిత వ్యాధులు, హైపర్ టెన్షన్, కొవ్వుపెరగడం, స్థూలకాయం, ఉదరకోశ, అన్నవాహిక క్యాన్సర్ల బారిన పడే ప్రమాదం ఉందని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు.

## 17 వరకు హైదరాబాద్ నుమాయిష్

**హైదరాబాద్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త**

హైదరాబాద్ లో ప్రతి ఏడాది అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే నుమాయిష్ ప్రదర్శన నాంపల్లి ఎక్జిబిషన్ గ్రౌండ్స్ లో కొనసాగుతోంది. రాష్ట్రం నుంచే కాకుండా దేశ నలుమూలల నుంచి వస్తుంటారు సందర్శకులు. దేశ వ్యాప్తంగా తయారు చేసిన వివిధ వస్తువులు తక్కువ ధరకు వస్తుండటం ఇక్కడ స్పెషల్. నుమాయిష్ షెడ్యూల్ ఫిబ్రవరి15తో ముగుస్తుంది. అయితే విజిటర్స్ కోసం మరో రెండు రోజులు అంటే ఫిబ్రవరి 17 వరకు పొడిగిస్తున్నట్లు నుమాయిష్ సెక్రెటరీ బి.సురేందర్ రెడ్డి తెలిపారు. ఫిబ్రవరి 17 తర్వాత ఎలాంటి పొడిగింపు ఉండదని ప్రకటించారు.ఎక్జిబిషన్ కు ప్రతి రోజు 50 వేల సందర్శకులు వస్తున్నారు.మొత్తం 2200 స్టాల్స్‌లో తమకు నచ్చిన వస్తువులు కొంటున్నారని సెక్రెటరీ తెలిపారు.ఈ నుమాయిష్ లో స్టార్టప్స్ కు సపోర్ట్ చేసేందుకు ఎక్జిబిషన్ సొసైటీ, ఐటీ హబ్, స్టేట్ ఐటీ మినిస్ట్రీ సంయుకనతంగా ఇన్నోవేషన్ హబ్‌ను ఏర్పాటు చేశారు.

## హైదరాబాద్ సిటీ పోలీసులు అద్భుత ప్రదర్శన

**-క్రీడాకారులను అభినందించిన సిపి సివి ఆనంద్..**



**పంజగుట్ట,ఫిబ్రవరి 7 ప్రభాతవార్త ః**

కరీంనగర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోలీసు స్పోర్ట్స్ మీట్‌లో హైదరాబాద్ సిటీ పోలీసులు అద్భుత ప్రదర్శన చేశారు. హైదరాబాద్ సిటీ పోలీసుకు చెందిన దాదాపు 236 మంది పోలీసు సిబ్బంది 26 విభాగాల్లో పోటీపడి 9 ఓవరాల్ ఛాంపియన్‌షిప్ టైటిళ్లతో పాటు 67 బంగారు, 32 రజత, 23 కాంస్య పతకాలను సాధించారు. శుక్రవారం సివి ఆనంద్ పతక విజేతలను అభినందించారు స్వతహాగా ఆనంద్ ఒక క్రీడాకారుడు కావున తీవ్రమైన పోలీసు విధులను సాగిస్తూ క్రీడలలో రాణించడానికి అవసరమైన అంకితభావం మరియు కఠినమైన శిక్షణను గుర్తించాడు., ముఖ్యంగా ఫైనల్స్‌లో ప్రదర్శించేందుకు ఎలాంటి ఒత్తిడిలోనైనా అవసరమైన మానసిక దృఢత్వాన్ని కలిగి ఉండాలని తెలిపారు. సి.పి ఆనంద్ తన పాఠశాల మరియు కళాశాల సంవత్సరాలలో అథ్లెట్‌గా తన స్వంత అనుభవాలను ప్రతిబింబిస్తూ, క్రీడలు క్రమశిక్షణ, జట్టు కృషిని మరియు జీవితంలోని సవాళ్లను నావిగేట్ చేసే సామర్థ్యాన్ని ఎలా పెంపొందిస్తాయి తెలియజేశారు. బలమైన క్రీడా మనస్తత్వం కలిగిన శారీరక దృఢత్వం కలిగిన సిబ్బంది పోలీసు సేవల డిమాండ్లనూ నిర్వహించడానికి మెరుగైన సన్నద్ధత కలిగి ఉంటారని కమిషనర్ పునరుద్ఘాటించారు.రాబోయే ఆల్ ఇండియా పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో రాణించేలా క్రీడాకారులను ప్రోత్సహిస్తూ, వారికి పూర్తి పరిపాలనా సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమములో. భాస్కర్, అడిషనల్ డిసిపి (అడ్మిన్)బి.కిష్టయ్య, అదనపు డిసిపి, .కిషన్ రావు, ఎసిపి (సిఎఆర్ స్పోర్ట్స్ ఆఫీసర్), ఇతర అధికారులు పాల్గొన్నారు.

## సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేయాలని ఆందోళన



ఓ.యూ పరిపాలన భవనం ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థులు

**తార్నాక, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** ఉస్మానియా యూనివర్సిటీ సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఉస్మానియా యూనివర్సిటీ పరిపాలన భవనం వద్ద పీజీ విద్యార్థులు ఆందోళన చేపట్టారు. ఓయూ సైన్స్, నిజాం కాలేజ్, సైఫాబాద్ పీజీ కాలేజ్, సికింద్రాబాద్ కాలేజ్ సైన్సు విద్యార్థులు శుక్రవారం మధ్యాహ్నం నుంచి 7 గంటల వరకు ఓయూ పరిపాలనా భవన్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ నెల 18 నుండి జరగనున్న మెదటి , మూడవ సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేయాలని, పలు పరీక్షలు అదే సమయంలో ఉండటంతో పాటుగా సిలబస్ పూర్తిస్థాయిలో పూర్తి కాలేదు కాలేదని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. శుక్రవారం రాత్రి వరకు పరిపాలన భవన్ ఎదుట ధర్నా కొనసాగుతునే ఉంది..అధికారులు మాత్రం కొన్ని వేల మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు పరీక్షలు వాయిదా వేసే అవకాశాలు లేవని ఓయూ అధికారులు చెప్పుతున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ ఈ నెల 15, 16న, ఫిబ్రవరి 2, 8, మార్చి 2 వివిద పరీక్షలు ఉన్నాయని తెలిపారు. సెమిస్టర్ పరీక్షలు ఫిబ్రవరి 18 ఫిబ్రవరి 27 వరకు పరీక్షలు నిర్వహిస్తే విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురిఅవుతారని చెప్పారు. ఇప్పటివరకు కొన్ని విభాగాల్లో సిలబస్ పూర్తి చేయలేదని, మాకు పరీక్షలకు ప్రిపేర్ అయ్యే సమయం లేదని,సెమిస్టర్ పరీక్షలు మార్చి 4వ తేదీ వరకు వాయిదా వేయాలని ఓయూ అధికారులను డిమాండ్ చేశారు.

## అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత



అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం లారీని పట్టుకున్న పోలీసులు దృశ్యం.

**ఉప్పల్, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త :** అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యంతోపాటు, గోదుమలను ఉప్పల్ పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ కోటేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్ పారిశ్రామికవాడలోని జెర్సీ కంపెనీ ఎదురుగా ఉన్న పార్కింగ్ స్థలంలో ఆపి ఉంచిన డిసిఎం వ్యాన్, రెండు ట్రక్‌లలో రేషన్ బియ్యం, గోదుమలు ఉండగా పట్టుకున్నట్లు తెలిపారు. లారీ డ్రైవర్ వెంకట్‌రెడ్డిని అరెస్ట్ చేశామని, మొత్తం 150 క్వింటాళ్ల బియ్యంతోపాటు, గోదుమలు పట్టుబడినట్లు తెలిపారు. ప్రధాని నిందితుడు అంబర్‌పేటకు చెందిన అబ్బు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## పట్టు పరిశ్రమ శాఖలో రూ.71 లక్షలు గోల్‌మాల్

**-మార్కెటింగ్ ఆఫీసర్‌పై కేసు నమోదు**

**కంటోనె మ్మంట్,ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:** రైతులకు చెల్లించాల్సిన డబ్బులలో అవకతవకలకు పాల్పడిన ఓ సెరికల్చర్ అధికారిపై తిరుమలగిరి పోలీసు లు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ జి.నాగయ్య తెలిపిన వివరాల ప్రకారం తిరుమలగిరి ప్రధాన రోడ్డు మార్గంలో ఉన్న పట్టు పరిశ్రమ సెరికల్చర్ కార్యాలయంలో మార్కెట్ అధికారిగా పనిచేస్తున్న శివకుమార్ తెలంగాణ రా ష్ట్రం నుంచి వివిధ ప్రాంతాల నుంచి పట్టు పురుగుల ద్వారా తయారైయ్యే పట్టును రైతులు తీసుకు వచ్చి తిరుమలగిరిలోని కార్యాలయంలో విక్రయిస్తుంటారు. పట్టు పరిశ్రమ శాఖ కొనుగోలు చేసిన పట్టును కర్నాటకకు చెందిన డీలర్లకు విక్రయించి తెలంగాణ రాష్ట్ర పట్టు పరిశ్రమ శాఖ సెరికల్చర్ కార్యాలయం ఖాతాలో జమ చేస్తారు. ఆ డబ్బులను రైతులకు అందజేయాలి ్సన బాధ్యత పట్టు పరి శ్రమ శాఖ అధికారులకు ఉంది. పట్టు పరి శ్రమ శాఖ ఖాతాలో ఉన్న రూ.71 లక్షల నిధులలో రూ.21 లక్షల రూపాయలను శివకుమార్ తన సొంత ఖాతాలో జమ చేసుకున్నారు. మరో రూ.50 లక్షలను రైతులకు పంచిపె ట్టారు. ఈ ఖాతాలో ఉన్న డబ్బులు ఎవరెవరికి ట్రాన్స్‌ఫర్ చేశారని రికారు ్డలను ఆడిట్ అధికారులు, అసిస్టెంట్ డైరెక్టర్ మహిపాల్ అరాతీ యగా సిరకల్చర్ ఖాతాలో ఉన్న డబ్బుల్లో గోల్‌మాల్ చేసిన శివకు మార్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అసిస్టెంట్ డైరెక్టర్ మహి పాల్ తిరుమలగిరి పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు. ఈ కేసును ఇన్‌స్పెక్టర్ నాగయ్య దర్యాప్తు చేస్తున్నారు.

## స్కూల్‌బస్సులపై ఆర్టీఏ అధికారుల దాడులు

**-సరైన పత్రాలు లేని 10వ్యాన్లు, బస్సులు సీజ్**

**హైదరాబాద్, ఫిబ్రవరి 7,ప్రభాతవార్త:**

శ్రీ చైతన్య స్కూల్ వ్యాన్ ఘటన నేపథ్యంలో ఆర్టీఏ అధికారులు హైదరాబాద్ వ్యాప్తంగా తనిఖీలు చేపట్టారు. నగరంలో నిబంధనలకు విరుద్ధంగా రాకపోకలు సాగిస్తున్న విద్యాసంస్థల బస్సులను తనిఖీ చేస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం వనస్థలిపురం వద్ద మన్నెగూడ ఆర్టీఏ అధికారులు స్కూల్, కాలేజీ బస్సులను తనిఖీ చేశారు. ఈ క్రమంలో సరైన పత్రాలు లేని 10 స్కూల్ వ్యాన్లు, బస్సులను సీజ్ చేశారు. వాహనాలు ఫిట్‌నెస్ లేకపోవడం, నాన్ ట్రాన్స్‌పోర్ట్ వాహనాలను వాడటం, రోడ్డు నిబంధనలపై డ్రైవర్లకు అవగాహన లేకపోవడం, పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించడం తదితర కారణాలను అధికారులు గుర్తించారు. ఇందులో ప్రముఖ స్కూళ్లకు చెందిన బస్సులు కూడా ఉన్నాయి. భాష్యం, శ్రీచైతన్య, ఆదిత్య, నారాయణ బస్సులు సీజయ్యాయి. పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించడం ప్రమాదకరమని తెలిసినా యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆర్టీఏ అధికారులు తెలిపారు. ఈస్పెషల్ డ్రైవ్లో మన్నెగూడ ఆర్టీవో సుభాష్ చంద్ర రెడ్డి, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ మున్ని తదితర అధికారులు పాల్గొన్నారు.

## అక్రమంగా గంజాయి తరలిస్తున్న వ్యక్తులు అరెస్టు

**అత్తాపూర్ ఫిబ్రవరి7,ప్రభాతవార్త :** అక్రమంగా కారులో గంజాయి తరలిస్తున్న వ్యక్తులను పట్టుకున్న సంఘటన అత్తాపూర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.ఇన్స్‌పెక్టర్ వెంకటరామిరెడ్డి వివరాల ప్రకారం...విశ్వసనీయ సమాచారం మేరకు అత్తాపూర్ పరిధిలోని పిల్లర్ నెంబర్ 160 ఫారెస్ట్ ఆఫీస్ దగ్గరలో సులేమాన్ నగర్ చెందిన మహమ్మద్ రేహాన్ (23)మిర్ అరాఫత్ అలీ (28) ,ఎంఎం పహాడి మహమ్మద్ సమీరుద్దీన్ (23) ఆసిఫ్ నగర్ మెహిదీపట్నంకు చెందిన అద్దుల రవి కుమార్ (28)లు ప్రయాణిస్తున్న కారును పోలీసులు తనిఖీ చేయగా వారి వద్ద 2.5 కేజీల గంజాయి లభించింది.వారిని విచారించగా బిదర్‌లోని జాఫర్ అనే వ్యక్తి నుండి కొనుగోలు చేసి నగరంలో ఎక్కువ ధరకు అమ్ముదామని తీసుకువస్తున్నట్లు తెలిపారు.ఈ మేరకు గంజాయిని స్వాధీనం చేసుకొని కారు,5 మొబైల్ ఫోన్‌లు,రూ.2500ల నగదు సీజ్ చేసి రిమాండ్ తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఫ్యాన్..ఏసి ఆన్

**-పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ఉక్కపోత -గ్రేటర్‌లో భారీగా విద్యుత్ వినియోగం -హీటెక్కుతున్న పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు**



**హైదరాబాద్, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త**

భానుడి ప్రతాపం అప్పుడే మొదలైంది. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు విద్యుత్ శాఖకు ముచ్చెమటలు పట్టిస్తున్నాయి. సాధారణంగా శివరాత్రి తర్వాత ఎండల తాకికి పెరుగుతుంది. ఈసారి మాత్రం ముందుగానే ఎండలు మండుతుండటంతో గ్రేటర్ హైదరాబాద్‌లో విద్యుత్ డిమాండ్ పెరిగింది. ఉదయం 10 గంటల తర్వాత సూర్యుడు సుర్రుమంటున్నాడు. మధ్యాహ్నం పూట బయటికి రావాలంటేనే నగరవాసులు కాస్త ఆలోచిస్తున్నారు. గురువారం గరిష్టంగా 36.4 సెల్సియస్ డిగ్రీలు, కనిష్టంగా 18.8 ఉష్ణోగ్రతలు నమోదయ్యియి. భగ్గున మండుతున్న ఎండలకు ఉక్కపోత తోడవడంతో ఉపశమనం కోసం సిటీజన్లు ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లు వినియోగిస్తున్నారు. ఒక్కసారిగా విద్యుత్ వినియోగం పెరగడంతో సబ్‌స్టేషన్లలోని ఫీడర్లు ఒత్తిడికి గురవుతున్నాయి. అయిల్ లీకేజీలను సరి చేయకపోవడంతో డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు ఒత్తిడి తట్టుకోలేక పేలిపోయే అవకాశాలు ఉన్నాయని నిపుణులు పేర్కొంటున్నారు. వేసవి ప్రారంభానికి ముందే లైన్ల పునరుద్ధరణ, లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు, డీటీఆర్‌లలో అయిల్ లీకేజీల నియంత్రణ, ఎర్తింగ్ ఏర్పాటు, లూజు లైన్లను సరి చేయడం వంటి పనులు పూర్తి చేయాల్సి ఉన్నా..అధికారులు ఇప్పటి వరకు వాటపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

-వాతావరణంలో ఒక్కసారిగా చోటు చేసుకున్న ఈ మార్పులను శరీరం తట్టుకోలేక పోతోంది. నిజానికి చలి కారణంగా నిన్న మొన్నటి వరకు ఫ్యాన్లు పెద్దగా వాడలేదు. ప్రస్తుతం ఉక్కపోత ప్రారంభం కావడంతో ఏకంగా ఏసీలను ఆన్ చేస్తున్నారు. కేవలం గృహ విద్యుత్ మాత్రమే కాకుండా వాణిజ్య వినియోగం భారీగా నమోదవుతోంది. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు పూర్తి స్థాయిలో పని చేస్తుండటమే ఇందుకు కారణం.

-ఫిబ్రవరి మొదటి వారంలో నగరంలో రోజు సగటున విద్యుత్ డిమాండ్ 52 మిలియన్ యూనిట్లు ఉండగా, ప్రస్తుతం 57 మిలియన్ యూనిట్లకు చేరుకుంది. రెండో శనివారం విద్యాసంస్థలతో పాటు ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు. వర్కింగ్ డేస్‌తో పోలిస్తే..సెలవు దినాల్లో వినయోగం కొంత తగ్గాల్సి ఉంది. కానీ ఇందుకు విరుద్ధంగా రికార్డు స్థాయిలో విద్యుత్ వినియోగం నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. మార్చి చివరి నాటికి 75 నుంచి 80 ఎంయూలకు చేరుకునే అవకాశం ఉన్నట్లు డిస్కం అధికారులు అంచనగా వేశారు.

## కష్టపడి చదివి తల్లిదండ్రులు, పాఠశాలకు మంచి పేరు తేవాలి

**-ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**





విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్‌దురిశెట్టి తదితరులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 7,ప్రభాతవార్త:**

జీవితంలో ఉన్నత స్థాయి ఎదగాలంటే లక్ష్యం నిర్దేశించుకుని బాగా కష్టపడి చదవాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. శుక్రవారం గన్ ఫౌండ్రీ మహబూబియా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏవో హైదరాబాద్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థినులకు సైకిల్ పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఉన్నత లక్ష్యం నిర్దేశించుకుని కష్టపడి చదివినప్పుడే సమాజంలో రాణించగలుగుతారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించడంతోపాటు వారికి అల్పాహారం అందించడం జరుగుతుందన్నారు. విద్యార్థులు దీన్ని సద్వినియోగం చేసుకొని మెరుగైన ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, పాఠశాలకు మంచి పేరు తేవాలని అన్నారు. పదవ తరగతి పరీక్షలు జీవితంలో టర్నింగ్ పాయింట్ అని బోర్డు పరీక్షలకు ఇంకా 40 రోజులకు పైగా సమయం ఉన్నందున విద్యార్థులు బాగా కష్టపడి చదివి ఉత్తీర్ణులు కావాలలని శారీరకంగా మానసికంగా దృఢంగా ఉండాలని సూచించారు. ప్రతి రోజుచదవడం, రాయడం చేయాలని, చదువుతోనే సమాజంలో మంచి గుర్తింపు అని చదువుతోనే తాను ఈ స్థాయికి ఎదిగానని కలెక్టర్ పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఎస్బిఐ ఏజిఎం సురేష్, ఎల్డిఎం సుబ్రహ్మణ్యం, డీఈవో ఆర్ రోహిణి, హెడ్మాస్టర్ గిరిజ, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు దాటాలంటే సర్కస్ ఫీట్లు చేయాల్సిందే

**-ప్రతి రోజు విద్యార్థులు, మహిళలకు తప్పని ఇక్కట్లు...**



శ్యాంలాల్ బిల్డింగ్ వద్ద రోడ్డు దాటుతున్న బస్తీవాసులు.

**బేగంపేట ఫిబ్రవరి 7,ప్రభాతవార్త**

బేగంపేట అంటేనే తక్కున ప్రతి ఒక్కరికీ గుర్తుకు వచ్చేది ట్రాఫిక్.అయితే నిత్యం ఎంతో రద్దీగా ఉండే బేగంపేట లో ఒక వైపు నుంచి మరోవైపుకు రోడ్డు దాటాలంటే సర్కస్ ఫీట్లు తప్పడం లేదంటున్నారు. మహిళలు, విద్యార్థులు. వీరితో పాటు వృద్ధులకైతే మరింత ఇబ్బందులు తప్పడం లేదు. రోడ్డు దాటే క్రమంలో వారు ప్రమాదాలకు గురవుతున్నారు.ఎన్నో ఏళ్లుగా ఈ సమస్య బేగంపేట వాసులను వేధిస్తున్నా అధికారులు గానీ,ప్రజా ప్రతినిధులు గానీ స్పందించిన దాఖలాలు లేవన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.బేగంపేట లో ఒక వైపు నుంచి మరో వైపుకు రోడ్డు దాటడం ప్రాణాన్ని పణంగా పెట్టాల్సిన పరిస్థితి అని వారు వాపోతున్నారు.బేగంపేట శ్యాంలాల్ బిల్డింగ్, తాతాచారి కాలనీ,పోచమ్మ బస్తీ,గురుమూర్తిలేన్, ఇలా పలు బస్తీలు ఒక వైపు ఉన్నాయి.ఆయా బస్తీల్లో ఉండే విద్యార్థులు పాఠశాలకు వెళ్లాలన్నా, మహిళలు ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగించాలన్నా రోడ్డు దాటి వెళ్లాల్సిన పరిస్థితి.అయితే ఈ ప్రాంతంలో రోడ్డు దాటడం ఒక సాహసంగానే పేర్కొనవచ్చు.అలాగే రసూల్‌పురా పోలీస్‌క్వార్టర్స్ వద్ద కూడా ఇదే పరిస్థితి ఉంది.రసూల్‌పురా ఇందిరమ్మ నగర్,అన్నానగర్ తదితర బస్తీలకు చెందిన వారు సికింద్రాబాద్ వెళ్లి రావాలంటే వారు రోడ్డు దాటి వెళ్లాల్సిందే.అయితే బేగంపేట ప్రభుత్వ మహిళా కళాశాల వద్ద ఏర్పాటు చేసిన ఫుట్ ఓవర్ బ్రిడ్జి కేవలం పేరున్న ఓ ప్రయివేటు పాఠశాల సౌకర్యం కోసమే ఏర్పాటు చేసారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.అయితే శ్యాంలాల్ బిల్డింగ్‌లో ఎక్కువగా బస్తీలు ఉన్నాయి.వారంతా నిత్యం సికింద్రాబాద్ ప్రాంతంలో పనులకు వెళుతుంటారు.ఇక విద్యార్థులు వివిధ పాఠశాలలకు వెళుతుంటారు.వీరు నిత్యం రోడ్డు అవతల దిగి రద్దీ ట్రాఫిక్‌ఉండే రోడ్డు దాటి ఇళ్లకు చేరుకోవాల్సి వస్తుంది.

**రోడ్డు దాటే క్రమంలో ప్రమాదాల బారిన పడుతున్న పాదచారులు....**

బేగంపేట శ్యాంలాల్ బిల్డింగ్,పోలీసులైన్ వద్ద రోడ్డు దాటాలంటే పాదచారులకు ప్రాణాంతకంగా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.రోడ్డు దాటే క్రమంలో వేగంగా వస్తున్న వాహనాలు,వారి వెనుక వచ్చే వాహనాలు రోడ్డు దాటుతున్న పాదచారులను ఢీకొట్టి వెళుతుండటంతో చాలా మంది గాయాల పాలైన ఘటనలున్నాయి.శ్యాంలాల్ బిల్డింగ్ భగత్‌సింగ్ నగర్‌కు చెందిన వయినాల లక్ష్మీభాయి అమీర్‌పేట లాల్ బంగ్లా సమీపంలో హౌస్ కీపింగ్ విధులు నిర్వర్తించేందుకు వెళ్లేందుకు శ్యాంలాల్ బిల్డింగ్ వద్ద రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఆమెకు తీవ్రంగా గాయాలయ్యాయి. అయితే ఇలా రోడ్డు దాటుతూ ప్రజలు గాయపడుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు మాత్రం పట్టించుకున్న దాఖలా లు లేవని స్థానికులు ఆరోపిస్తున్నారు.మహిళా కళాశాల ముందు నిర్మించిన ఫుట్ ఓవర్ బ్రిడ్జి శ్యాంలాల్ బిల్డింగ్,పోలీసు లైన్ వద్ద నిర్మించిన ట్లైతే ఎంతో సౌకర్యవంతంగా ఉండేదని, ఇప్పటికైనా పై రెండు ప్రాంతాల్లో ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను నిర్మించేలా కృషి చేయాలని పై బస్తీల వాసులు కోరుతున్నారు.

## స్వామి వివేకానందుని ఆదర్శంగా తీసుకోవాలి

**-నార్త్‌జోన్ ట్రాఫిక్ ఎసిపి శంకరరాజు**



విద్యార్థులకు బహుమతి ప్రధానం చేస్తున్న నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకరరాజు.

**బేగంపేట ఫిబ్రవరి 7,ప్రభాతవార్త**

చిన్నారులు తమ జీవితంలో స్వామి వివేకానందుని ఆదర్శంగా తీసుకోవాలని నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ జి.శంకరరాజు అన్నారు. బేగంపేట చికోటి గార్డెన్‌లో దియా స్కూలు వార్షికోత్సవ వేడుకలలోఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ట్రాఫిక్ ఏసీపీ శంకరరాజు మాట్లాడుతూ స్వామి వివేకానంద క్రమశిక్షణ,కష్టపడే ధోరణి,ఆత్మవిశ్వాసం అనే విలువలను బోధించారని అన్నారు.ఈ సందర్భంగా విధ్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు వారి ప్రతిభను సృజనాత్మకతను వెలుగులోకి తీసుకు వచ్చాయి.అధికారులు,అతిధులు తమ అభినందనలు తెలియజేసి చిన్నారులు తమ జీవితంలో అన్ని రంగాల్లో రాణించాలని ప్రోత్సహించారు.ఈ కార్యక్రమంలో ఎం.వి.సుకుమార్,జి.లక్ష్మీ,మోన్ ఫ్లోరెన్స్ పెద్ద సంఖ్యలో చిన్నారులు వారి తల్లి దండ్రులు పాల్గొన్నారు.

## డివిజన్ సమగ్రాభివృద్ధే లక్ష్యం : కార్పొరేటర్



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

**అల్వాల్, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:**

ప్రజావసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు కొనసాగిస్తామని వెంకటాపురం కార్పొరేటర్ సబిత అనీల్ కిషోర్ తెలిపారు. శుక్రవారం వెస్ట్ వెంకటాపురం శివాలయం వద్ద మంచినీటి పైపులైను డైవర్షన్ పనులను కార్పొరేటర్ పరిశీలించారు. ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి సహాయ సకారాలుతో అభివృద్ధిని ముందుకు తీసుకుని వెళుతున్నామని ఆమె తెలిపారు. ప్రజలు అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ క్రిష్ణమాచారి వర్క్ ఇన్‌స్పెక్టర్ శేఖర్ బిఆర్ఎస్ నేతలు అనీల్ కిషోర్ ఇతరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ తీన్మార్ మల్లనపై చర్యలు తీసుకోండి

**-పోలీసులకు అల్వాల్ రెడ్డి సంఘం ఫిర్యాదు**



ఫిర్యాదు అందిస్తున్న సంఘం ప్రతినిధులు

**అల్వాల్, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:**

రెడ్డి కులస్తులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై చర్యలు తీసుకోవాలని కోరుతూ అల్వాల్ రెడ్డి సంఘం ప్రతినిధులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల వరంగల్ బిసి సభలో ప్రత్యేకంగా రెడ్డి కులస్తులుపై మల్లన్న తీవ్రమైన వ్యాఖ్యలు చేశారని పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధిగా అన్ని కులాలు మతాలను గౌరవించాల్సిన వ్యక్తి తన విచక్షణను కోల్పోయి మాట్లాడారని విమర్శించారు. తక్షణం రాష్ట్ర పోలీసులు ఆయనపై కేసు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు.

## ఈదమ్మ తల్లి ఆలయ పునర్నిర్మాణం ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న పావనీ వినయకుమార్

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:** గాంధీనగర్ డివిజన్ దోభి ఘాట్ బస్తీలో వెలసిన ఈదమ్మా తల్లి ఆలయ పునర్నిర్మాణం ప్రత్యేక పూజలో శుక్రవారం స్థానిక కార్పొరేటర్ ఎ.పావని వినయ్ కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్మాణం కమిటీ మరియు బస్తి వాసులు కార్పొరేటర్‌ను సత్కరించి అమ్మ వారి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్, గ్రేటర్ హైదరాబాద్ రజక అభివృద్ధి సంఘం ఛైర్మెన్ నరసింహ,బీజేపీ డివిజన్ అధ్యక్షుడు వి.నవీన్ కుమార్, ఓబీసీ మోర్చ అసెంబ్లీ కన్వీనర్ ఎం.ఉమేష్, నాయకులు సత్తి రెడ్డి, శ్రీనివాస్,ప్రకాష్ యాదవ్, శ్రీను, ప్రశాంత్ మరియు బస్తి వాసులు మల్లికార్జున్, నాగేష్,వెంకటేష్, సత్యనారాయణ. సాయి కిరణ్, సురేష్, రమేష్,అశోక్,విష్ణు, లక్ష్మి, వరమ్మ,పూజిత, సత్యనారాయణ,శోభ,రమేష్,రామ్,నరేష్,అనిల్,బుజ్జి,నాగరాజ్ పాల్గొన్నారు.

## దేవాలయాల అభివృద్ధికి నా వంతు కృషి

**: ఎమ్మెల్యే ముఠాగోపాల్**

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:** ముషీరాబాద్ నియోజకవర్గంలో దేవాలయాల అభివృద్ధికి తనకృషి తప్పకుండా ఉంటుందని స్థానిక శాసనసభ్యుడు ముఠాగోపాల్ అన్నారు. నియోజకవర్గంలో దాదాపు అన్నిదేవాలయాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరిగిందని, ప్రత్యేకంగా కొన్ని ప్రాంతాలలో సొంత ఖర్చులతో అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. శుక్రవారం గాంధీనగర్ డివిజన్ దోభిఘాట్ బస్తీలో ఈదమ్మతల్లి ఆలయం పునర్నిర్మాణ పూజా కార్యక్రమంలో స్థానిక బిఆర్ఎస్ నేతలు ముఠానరేశ్, పుట్టనవీన్‌యాదవ్, బస్తీవాసులు మల్లికార్జున్, వెంకటేశ్, క్రాంతిలతో కలిసి పాల్గొన్నారు. మున్ముందు కూడా ఆలయాలకు మరింత శోభ వచ్చే విధంగా సహాయ సహకారాలను అందిస్తానని ముఠాగోపాల్ అన్నారు.

## నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

**నార్సింగి, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త :** వేసవి కాలంలో పెరిగే విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని చేపడుతున్న అభివృద్ధి పనుల కోసం నేడు ఈ క్రింది ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నామని నార్సింగి ఏఇ మణికంఠ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11.గంటల నుంచి మధ్యాహ్నాం 2.గంటల వరకు మార్కెట్ యార్డు సబ్‌స్టేసన్ 11.కేవీ నార్సింగి, 11.కేవీ వివేకానంద ఫీడర్ పరిధిలోని నార్సింగి, నార్సింగి హైట్స్, ఖాబా కాలనీ, ఖాస్వా కాలనీ, వివేకానందనగర్ కాలనీ ప్రాంతాలలో, అలాగే కోకాపేట్ సబ్ స్టేషన్ 11.కేవీ బాబూఖాన్ ఫీడర్ పరిధిలో ఉదయం పదిన్నర గంటల నుంచి 11.గంటల వరకు కోకాపేట్‌లోని 250.గజాలు, గోల్డెన్ మైల్, బాబుఖాన్ విల్లాస్, గ్రాండ్ ఇన్‌ఫ్రా టెక్ విల్లాస్, దంతు స్వీట్‌హౌస్ ప్రాంతాలలో కరెంటు సరఫరాను నిలిపివేస్తున్నామని, ఇందుకు వినియోగదారులంతా తమకు సహకరించాలని ఏఇ కోరారు.

# రాష్ట్రంలో ఉప ఎన్నికలు రావడం తథ్యం : కార్తిక్‌రెడ్డి

**- రాజేంద్రనగర్ నుంచి అసెంబ్లీ బరిలో నేనే దిగుతున్నా**
**- ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం సర్వ నాశనం**
**- మెట్రో రైల్ ప్రాజెక్టును రద్దు చేసి రాజేంద్రనగర్‌కు తీరని అన్యాయం**



బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న రాజేంద్రనగర్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇంచార్జి కార్తిక్‌రెడ్డి.

**నార్సింగి, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త :** పార్టీ ఫిరాయించిన పది స్థానాలలో ముమ్మాటికి ఉప ఎన్నికలు రావడం... ఆ పదింటిలో బిఆర్ఎస్ గెలువడం తథ్యమని రాజేంద్రనగర్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇంచార్జి కార్తిక్‌రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం కార్పోరేషన్ బిఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కార్తిక్ రెడ్డి మాట్లాడుతూ ఏడాదిన్నర కాంగ్రెస్ పాలన తెలంగాణ రాష్ట్రంను సర్వనాశనం చేసి, ప్రజాగ్రహానికి గురైందని ఆరోపించారు. త్వరలో వచ్చే ఉప ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్ పాలకులకు చెంపపెట్టులాగా మారుతాయని, ప్రజలు తమ ఆగ్రహంను ఓట్ల రూపంలో చూపించేందుకు సిద్దంగా ఉన్నారని వివరించారు. బండ్లగూడ కార్పోరేషన్‌లో గురువారం ప్రారంభించిన అభివృద్ది పనులన్ని బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన నిధుల తోనే నిర్మించడం జరిగిందని తెలిపారు. ఏడాది కాలం పాటు కేవలం పది శాతం పనులు చేయించి అంతా తామే చేసినట్లు మంత్రి, ఎమ్మెల్యే కలరింట్ ఇచ్చుకోవడం సిగ్గుచేటన్నారు. ఏడాదిన్నర కాలంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి అదనపు నిధులను కూడా ఎమ్మెల్యే తీసుకు రాలేదని దుయ్యబట్టారు. కార్పోరేషన్ డబ్బులతో చేపట్టిన పనులు తామే చేసినట్లు ఫొటోలకు ఫోజులిచ్చుకున్నారన్నారు. సీఎం కేసీఆర్ ఓఆర్ఆర్ లోపల ఉన్న అన్ని ప్రాంతాలలో నీటి ఇబ్బందులు తలెత్తకూడదని ఏకంగా రూ.3.వేల కోట్లను మంజూరు చేసి, మున్సిపల్ మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో వేగంగా వాటర్ సంపులు, పైప్‌లైన్లు, ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మించడం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గచ్చిబౌలి నుంచి శంషాబాద్ విమానాశ్రయంకు బిఆర్ఎస్ సర్కారు మంజూరు చేసిన "మెట్రో రైల్ ప్రాజెక్టును" రద్దు చేసి రాజేంద్రనగర్ నియోజకవర్గంకు తీరని అన్యాయం చేసిందని ఆరోపించారు. అలాగే కిస్మత్‌పూర్-బండ్లగూడ రోడ్డు ఏళ్ల తరబడి విస్తరణకు నోచుకోవడం లేదని, సరైన మౌళిక వసుతలు కల్పించడంలో పాలకులు విఫలమవుతున్నారన్నారు. రాజేంద్రనగర్‌తో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడికక్కడ అభివృద్ది ఆగిపోయిందని, రియల్ రంగం కుదేలయ్యిందని, ఆదాయం ఘోరంగా పడిపోతుందని, ఇంత జరుగుతున్నా కాంగ్రెస్ సర్కారులోని పెద్దలకు చీమకుట్టినట్లు కూడా లేదని కార్తిక్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఉప ఎన్నికలు వస్తే... రాజేంద్రనగర్ అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ పార్టీ తరపున తాను పోటీ చేస్తానని, ఈ ప్రాంత ప్రజల ఆశీర్వాదంతో తొలిసారి అసెంబ్లీలో కాలుమోపుతానని కార్తిక్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు సీతారాం ధూళిపాళ్ల, రవీందర్‌రెడ్డి, రాముడు యాదవ్, శాంతి నాయక్, అందె లక్ష్మణ్, చింతల శ్రీనివాస్ ముదిరాజ్ పాల్గొన్నారు.

## ఓ.యూలో ముగిసిన హెచ్‌సిడిసి వీడియో ఎడిటింగ్ బూట్‌క్యాంప్



ఎడిటింగ్‌లో ఉత్తమ ప్రతిభకనబర్చిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న ప్రిన్సిపల్ ఐ.శేఖర్ చిత్రంలో ప్రొఫెసర్లు

**తార్నాక, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త :** ఉస్మానియా విశ్వవిద్యాలయం హ్యూమన్ క్యాపిటల్ డెవలప్‌మెంట్ సెంటర్ (హెచ్‌సిడీసి) ఆధ్వర్యంలో ఈ నెల 4 నుంచి 7 వరకు "నాలుగు రోజుల వీడియో ఎడిటింగ్ బూట్‌క్యాంప్" ను విజయవంతంగా నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమం హెచ్‌సీడీసీ కార్యాలయం, సిఎఫ్ఆర్‌డీ భవనం, ఉస్మానియా విశ్వవిద్యాలయం క్యాంపస్‌లోని ఈ క్లాస్ రూంలో ప్రతి రోజు ఉదయం నుండి సాయంత్రం 5 గంటల వరకు నిర్వంచారు. ఈ కార్యక్రమానికి ఉస్మానియా విశ్వవిద్యాలయం కామర్స్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఐ. శేఖర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. హెచ్‌సీడీసి డైరెక్టర్ ప్రొఫెసర్ సి.వి. రంజని,హెచ్‌సిడీసి సమన్వయకర్త డాక్టర్ పి. మురళీధర్ రెడ్డి, ఈ శిక్షణా కార్యక్రమాన్ని నడిపించారు. వర్సిటీ క్యాంపస్, అనుబంధ కళాశాలల నుండి వచ్చిన పీజీ విద్యార్థులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో ఉస్తాహంగా పాల్గొన్నారు.శిక్షణా శిబిరంలో వీడియో ఎడిటింగ్ సాఫ్ట్‌వేర్, ప్రాథమిక సాధనాల పరిచయం.కటింగ్, ట్రిమ్మింగ్, ట్రాన్సిషన్లు, ఎడిటింగ్ పద్ధతులు, విజువల్ ఎఫెక్ట్స్, కలర్ గ్రేడింగ్, విద్యార్థులు ఒక ప్రాజెక్ట్‌ను రూపొందించి, ఎక్స్‌పోర్టింగ్, రెండరింగ్ ఉత్తమ పద్ధతులను నేర్చుకున్నారు.ఈ సందర్భంగా ప్రొఫెసర్ ఐ. శేఖర్ మాట్లాడుతూ విద్యార్థుల ఆసక్తిని అభినందిస్తూ, వీడియో ఎడిటింగ్ విద్యార్థులకు ప్రొఫెషనల్, పర్సనల్ ప్రాజెక్టులకు ఉపయోగపడే కీలకమైన నైపుణ్యం అని తెలిపారు. ప్రొఫెసర్ సి.వి. రంజని, డాక్టర్ పి. మురళీధర్ రెడ్డి వీడియో ఎడిటింగ్ ఇంటర్న్‌షిప్‌లు మరియు పూర్తి స్థాయి ఉద్యోగ అవకాశాలకు మార్గదర్శిగా నిలుస్తుందని తెలియజేశారు.కార్యక్రమం విద్యార్థుల అభిప్రాయ సేకరణ, సర్టిఫికేట్‌ల పంపిణీతో విజయవంతంగా ముగిసిందని వారు తెలిపారు.

# సివిల్ వివాదంలో పోలీసులు జోక్యం....వృద్దుడు మృతి

**యూసుఫ్‌గూడ ఫిబ్రవరి 7, ప్రభాతవార్త :**

ఇంటి తగాదాల వ్యహారంలో పోలీసుల వేధింపులు తాలలేక తన తండ్రి మృతి చెందాడని ఓ కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు ఈ సంఘటన నగరంలోని బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. అయితే ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటన నేపథ్యంలో సివిల్ వివాదంలో ఎలా జోక్యం చేసుకుంటారంటూ బోరబండ పోలీసులపై డీసీపీ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది రహమత్‌నగర్ డివిజన్ పరిధిలోని శ్రీరామ్‌నగర్‌కు చెందిన సయ్యద్ అల్తాఫ్(62) విశ్రాంత ప్రైవేట్ ఉద్యోగి ఆయన కుటుంబానికి శ్రీరామ్‌నగర్‌లో 160 గజాల స్థలం ఉంది. గతంలోనే అల్తాఫ్, అతడి సోదరులు 40 గజాల చొప్పున పంచుకుని ఇళ్లు నిర్మించుకున్నారు. 3వ సోదరు ఇటీవల మృతి చెందాడు. మృతుడి కుమారుడు సయ్యద్ ముస్తాఫ, అతడి భార్య నజియా, చిన్నాన సయ్యద్ గఫూర్‌లు అల్తాఫ్ ఇంట్లోకి అక్రమ ప్రవేశించి ఉంటున్నారు. విషయం తెలుసుకున్న అల్తాఫ్ నిలదీయడంతో ఇరుకుటుంబాల మధ్య గొడవ జరుగుతోంది. ఈ క్రమంలో గత నాలుగు రోజుల క్రితం ఆల్తాఫ్ తన ఇంట్లో ఉన్న ముస్తాఫా సామాన్లను బయటపడేశాడు. దీంతో ముస్తఫా బోరబండ పోలీసులను ఆశ్రయించాడు. తన సామాన్లతో పాటు భారీగా డబ్బులు, నగదు పోయినట్లు ఫిర్యాదు చేశాడు. పోలీసులు వాస్తవాలు తెలుసుకోకుండా అల్తాఫ్‌ను రెండు రోజులపాటు స్టేషన్‌లో నిర్బందించారు. ఉదయం స్టేషన్‌కు తీసుకెళ్లి కూర్చోపెట్టి పంపేవారు. ఈ నెల 4వ తేదీన కూడా పోలీసులు ఇంటికి రాగానే వారిని చూసిన ఆల్తాఫ్ భయంతో వణికిపోయి అక్కడే కుప్పకూలి పోయాడు. గుండెపోటు రావటంతో ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న పశ్చిమ మండలం డీసీపీ బోరబండ పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సివిల్ వివాధంలో ఎలా తల దూరుస్తారంటూ పోలీసులను ప్రశ్నించారు.

ఇదిలా ఉండగా సివిల్ వ్యవహారంలో పోలీసుల ప్రమేయమే కాకుండా 20 రోజులుగా రసూల్ సెల్‌ఫోన్‌ను తమ ఆదీనంలోకి తీసుకున్నారని మృతుడి కుమారుడు ఆల్తాఫ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

## కుల గణన లెక్కలపై ప్రభుత్వం సమగ్ర సమాచారం ప్రకటించాలి

**బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్**

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కులగణన లో బిసి కులాల జనాభా లెక్కలను కులాల వారిగా సమగ్ర వివరాలతో కూడిన సమాచారాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రజల ముందు ఉంచాలని బహుజన లెఫ్ట్ పార్టీ(బహుజన కమ్యూనిస్టు) బిఎల్పీ రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక పార్టీ రాష్ట్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన బిసి కులాల సంఘాల నాయకులు, ప్రతిపక్ష పార్టీలు బిసి కులాల జనాభా లెక్కల వివరాలపై అనుమానాలు వ్యక్తంచేస్తున్న నేపథ్యంలో బిసి కులాల మేధావులు, బిసి ప్రజా ప్రతినిధులతోపాటు అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేసి అనుమానాలపై నివృత్తి చేయాలని దండి వెంకట్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రత్యేక అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వం ప్రవేశపెట్టిన సమగ్ర కుల గణన సర్వే వివరాలపై సమగ్ర చర్చకంటే బీఆర్ఎస్, బిజెపి తమ రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవడానికే ఎక్కువ ప్రాధాన్యతనుఇచ్చాయని దండి వెంకట్ విమర్శించారు.ఎస్సీ వర్గీకరణ గెజిటెడ్ విడుదల చేసేముందు మాదిగ,మాల వాటి ఉప కులాల మేధావులతో ప్రభుత్వం చర్చించాలని రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి గారి విజ్ఞప్తి చేశారు. మూడు దశాబ్దా ల వర్గీకరణ పోరాటానికి ఇకనైనా సామాజిక న్యాయం సమగ్రాభివృద్ధికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బాటలు వేసి దేశానికి ఆదర్శంగా నిలవాలని దండి వెంకట్ ఆకాంక్షను వ్యక్తం చేశారు.

### అభివృద్ధికై యువత ఐక్యంగా ఉద్యమించాలి

**హైదరాబాద్, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:** రెండు తెలుగు రాష్ట్రాల అభివృద్ధికై యువత ఐక్యంగా ఉద్యమిద్దామని ఎఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వలిఉల్లా ఖాద్రి, కల్లూరు ధర్మేంద్ర పిలుపునిచ్చారు. ఈ మేరకు ఎఐవైఎఫ్ రాష్ట్ర 22వ మహాసభలు జరిగాయని, ఈ మహాసభల్లో తాము సౌహార్ధ ప్రతినిధులుగా పాల్గొని ప్రసంగించడం జరిగిందని వారు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విభజన తరువాత కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం అనేక వాగ్ధానాలు చేసి అమలు చేయలేదని ఆరోపించారు. తెలుగు రాష్ట్రాలకు ప్రత్యేక ప్యాకేజీని ఇస్తామని ప్రకటించిన కేంద్రం ఇవ్వ కుండా మోసం చేసిందని వారు పేర్కొన్నారు. దేశంలో యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పించలేని ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం మతంతో ప్రజలను కడుపునింపుతుందనే అజ్ఞానపు పోకడలను అనుసరిస్తున్నదని వారు ఆరోపించారు.

## క్రీడాస్ఫూర్తికి బాల్యదశలోనే పునాది పడాలి: శివరాత్రి యాదగిరి

**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త**

క్రీడాస్ఫూర్తికి బాల్యదశనుండే పునాది ఏర్పడడానికి ఉపాధ్యాయులతోపాటు తల్లిదండ్రులు సమాన బాధ్యత వహించాలని తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు శివరాత్రి యాదగిరి పిలుపునిచ్చారు. ట్రస్మా ఆధ్వర్యంలో రెండవరోజు కుత్బుల్లాపూర్ మున్సిపల్ గ్రౌండ్స్‌లో బాలికల ఖోఖో, బాలుర కబడ్డీ పోటీలను ఆయన జెండాఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ కుత్బుల్లాపూర్ మండలశాఖ అధ్యక్షులు శ్రీనివాసచారి, ప్రధానకార్యదర్శులు తిరుపతిరెడ్డి, నర్సిరెడ్డి, కోశాధకారి శ్రీకాంత్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ప్రస్తుత తరుణంలో భారతదేశం అన్ని రంగాలలో అగ్రగామిగా నిలుస్తుందని దీనిని మరింత ముందుకు తీసుకువెళ్లడంలో క్రీడలప్రాధాన్యతతెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ అన్ని రంగాలలో విద్యార్థులకు తీర్చిదిద్దేందుకు పూర్తిబాధ్యత వహిస్తుందన్నారు.కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి బాల్‌రాజ్, గండిమైసమ్మ మండలశాఖ అధ్యక్షులు ప్రవీణ్‌కుమార్, బాస్కర్ రెడ్డి, అంబదాస్, ఉపాధ్యక్షులు బల్వంత్, బాచుపల్లి మండల అసోసియేషన్ అధ్యక్షులు ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా వందలాదిమంది విద్యార్థుల కేరింతల మధ్య పోటీదారులు తమ ప్రతిభను కనబర్చారు.

### బయోమైనింగ్ పనులు పరిశీలించిన ఆర్‌డిఎంఎ శ్రీనివాసరావు

**దుండిగల్, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:** దుండిగల్ పురపాలిక సంఘం పరిధి దొమ్మరపోచంపల్లి సర్వేనంబర్ 120లోని డంపింగ్‌యార్డులో జరుగుతున్న బయోమైనింగ్ పనులను శుక్రవారం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ హైదరాబాద్ రీజినల్ డైరెక్టర్ జె.శ్రీనివాసరావు పరిశీలించారు. ఈసందర్భంగా బయోమైనింగ్ పనులు చేస్తున్న సాగర్ మోటార్స్ కంపెనీ ప్రతినిధులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. 90శాతం పనులు పూర్తి అవడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పనుల్లో నాణ్యత లోపించకూడదని, మిగిలిన పనులను త్వరితంగా పూర్తి చేయాలని సాగర్ మోటార్స్ ప్రతినిధులను ఆదేశించారు. అదే విధంగా డంపింగ్‌యార్డును సందర్శిస్తూ పనులను పరిశీలించాలని కమీషనర్ వెంకటేశ్వర్‌నాయక్‌కు సూచించారు. కార్యక్రమంలో ఏఈ సురేందర్‌నాయక్, ఎన్విరాన్మెంట్ ఇంజినీర్ సాత్విక్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## వర్సిటీల్లో పాత పద్ధతిలోనే ప్రొఫెసర్ల రిక్రూట్‌మెంట్ నిర్వహించాలి : టీజీడీప



వినతిపత్రాన్ని అందజేస్తున్న

**తార్నాక, ఫిబ్రవరి7 ప్రభాతవార్త :** రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లో చేపట్టే ప్రొఫెసర్ల రిక్రూట్ మెంట్ ను పాతపద్ధతిలోనే చేపట్టాలని తెలంగాణ స్టేట్ డాక్టరేట్స్ అసోసియేషన్(టీజీడీఏ) కోరింది. స్క్రీనింగ్ టెస్టుల పేరుతో రిక్రూట్ మెంట్ ను వివాదస్పదం చేయకుండా యూజీసీ నిబంధనల మేరకు రిక్రూట్ మెంట్ ప్రక్రియను చేపట్టాలని విజ్ఞప్తి చేసింది. 15 ఏళ్లుగా యూనివర్సిటీల్లో ఎలాంటి రిక్రూట్ మెంట్ లేక ఆందోళన చెందుతున్న నిరుద్యోగుల బాధలను, సమస్యలను గుర్తించాలని అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు శుక్రవారం అసోసియేషన్ మాజీ అధ్యక్షులు డాక్టర్ పొలాడి రమణరావు, అధ్యక్షులు డాక్టర్ పి. నరేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు డాక్టర్ బొల్లం తిరుపతి, డాక్టర్ ధాత్రిక స్వప్న, అధికార ప్రతినిధులు డాక్టర్ రవి తేజ, డాక్టర్ తిరుపతి, డాక్టర్ వినయ్, డాక్టర్ స్వామినాయక్ లు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ బాలక్రిష్టా రెడ్డిని కలిసి వినతి పత్రం ఇచ్చారు. ప్రొఫెసర్ల రిక్రూట్ మెంట్ పై కొంత మంది ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఛైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. గత ప్రభుత్వంలో విద్యారంగం భ్రష్టుపట్టేందుకు కారకులైన వారే ఇప్పుడు కీలక పాత్ర పోషించి.. నిరుద్యోగులకు అన్యాయం చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. అమలు కావడానికి వీలు లేని సూచనలు, సలహాలు ప్రభుత్వానికి ఇచ్చి రిక్రూట్ మెంట్ లో వివాదాలు లేవనెత్తే విధంగా చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. 2013లో చేపట్టిన రిక్రూట్ మెంట్ మాదిరిగానే ఇప్పుడు చేపట్టబోయే రిక్రూట్ మెంట్ ను చేయాలని ఛైర్మన్ ను కోరారు. తెలంగాణ ఉద్యమంలో పోరాటం చేసిన వారిలో అన్ని అర్హతలు కలిగి ఉన్న పోరాటం చేసిన ఉన్నత విద్యావంతులను కాదని.. నాన్ లోకల్ అభ్యర్థులకు ప్రొఫెసర్ పోస్టులను కట్టబెట్టే విధంగా చర్యలు చేపడుతున్నారని వాపోయారు. తెలంగాణ నిరుద్యోగులకు న్యాయం చేసే విధంగా ఈ సారి చేపట్టే రిక్రూట్ మెంట్ ను పాత పద్దతిలో చేపట్టి యూనివర్సిటీలను బలోపేతం చేయాలని, ఇప్పటి వరకు అన్ని యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న 2వేలకు పైగా ఉన్న పోస్టులను ఒకే సారి భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అసోసియేషన్ ప్రతినిధులు చెప్పిన విషయాలను విన్న ఛైర్మన్ ప్రొఫెసర్ బాలక్రిష్టారెడ్డి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. రిక్రూట్ మెంట్ లో ఎలాంటి వివాదం లేకుండా, తెలంగాణ నిరుద్యోగులకు న్యాయం చేసే విధంగా చూస్తామని, పాత విధానం వైపే మొగ్గు చూపే అవకాశం ఉందని చెప్పారు.

## పిసిఓడి సమస్యలపై అవగాహన సదస్సు

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:** విద్యానగర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారత విభాగం, హెల్త్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో అమ్మాయిలకు పిసిఒడి సమస్యలపై నిర్వహించిన అవగాహన సదస్సుకు ప్రధాన వక్తగా సత్య సాయి సేవా సమితి సభ్యులు శోభ పాల్గొని ప్రసంగించారు. అమ్మాయిలు రుతుక్రమ సమస్యలను ఎదుర్కోవడానికి ముందుగా ఒత్తిడిని జయించాలని, నీరు అధికంగా ఉన్న ఆహార పదార్థాలతోపాటు సమతుల ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మహిళా సాధికారత విభాగం యొక్క బ్యానర్ ను కూడా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డా. ఆర్.లావణ్య, హెల్త్ క్లబ్ కోఆర్డినేటర్ కె. నీరజ, మహిళా సాధికారత విభాగం కోఆర్డినేటర్ ఎస్. రమాదేవి, ఎన్.ఎస్.ఎస్.కోఆర్డినేటర్ ఓ. పద్మజ, కోఆర్డినేటర్ డా. పి. పద్మజ మరియు మహిళా అధ్యాపకులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

## కనుమరగవుతున్న ప్రాచీనకళలను పరిరక్షించుకోవాలి

**-మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ సముద్రాల వేణుగోపాలాచారి**



అనగాని నరసింహ (వరంగల్) భాగవతార్‌ను సత్కరించిన దృశ్యం

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:**

కనుమరగవుతున్న ప్రాచీనకళలను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ సముద్రాల వేణుగోపాలాచారి అన్నారు. ఇందులో భాగంగా విశ్రాంత ఐఎఎస్ అధికారి డాక్టర్ కె.వి.రమణాచారి తన జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని హరికథా మహోత్సవాలను సప్తాహంగా నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. గురువారం రాత్రి నల్లకుంటలోని శృంగేరి శంకరమఠంలో కిన్నెర ఆర్ట్ థియేటర్స్, కిన్నెర కల్చరల్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో విశ్రాంత ఐఎఎస్ అధికారి ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కె.వి.రమణాచారి జన్మదినోత్సవాలను పురస్కరించుకుని 'హరికథా మహోత్సవాల'లో భాగంగా అనగాని నరసింహ (వరంగల్) భాగవతార్‌చే 'రుక్మిణీ కల్యాణం' హరికథాగాన కార్యక్రమం అద్భుతంగా సాగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న సముద్రాల వేణుగోపాలాచారి పాల్గొని హరికథ విశిష్టత గురించి ప్రసంగించారు. వేదిక పై విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కెవి.రమణాచారి, కె.కృష్ణారావు, కిన్నెర సంస్థ స్థాపక కార్యదర్శి మద్దాళి రఘురామ్, సుబ్బారావు, వెంకటరావు, సతీష్ తదితరులు పాల్గొన్నారు. హరికథాగానానికి వయోలిన్‌పై ధూళిపాల శ్రీనివాసమూర్తి, మృదంగంపై రాయప్రోలు సుధాకర్ వాద్యసహకారాన్ని అందించారు.

## నేడే పుష్పగిరి పీఠాధిపతుల అనుగ్రహ భాషణం

**రవీంద్రభారతి, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త :** పరమపూజ్య పుష్పగిరి పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ అభినవోద్దండ విద్యాశంకర భారతీస్వాముల వారు ఈరోజు అనుగ్రహ భాషణం కావించనున్నారు. ఈ మేరకు ప్రముఖ సాంస్కృతిక సంస్థలు సత్కళాభారతి, యువకళావాహిని, తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో నేడు 8వ తేదీ శనివారం సాయంత్రం 4గంటల నుండి రవీంద్రభారతి ప్రధాన మందిరంలో తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి, ఉభయ తెలుగురాష్ట్రాల సాంస్కృతిక సౌజ్య ప్రదాత, అజాతశత్రువు డా. కె.వి.రమణాచారి 73వ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని ఆయనకు దివ్య ఆశీస్సులందించి ప్రసంగిస్తారని సత్కళాభారతి వ్యవస్థాపక అధ్యక్షుడు జి.సత్యనారాయణ మీడియాకు తెలిపారు. సాంస్కృతికబంధు సారిపల్లి కొండలరావు సభాధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమాలకు విశిష్ట అతిథిగా తెలంగాణ రాష్ట్ర సంగీత నాటక అకాడమీ ఛైర్‌పర్సన్ ఆచార్య అలేఖ్య పుంజాల, గౌరవ అతిథులుగా రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. మామిడి హరికృష్ణ, రాష్ట్ర కార్మికశాఖ అదనపు కమిషర్ డా. ఇ.గంగాధర్, ఇతర నిర్వాహక సంస్థల అధ్యక్షులు లంక లక్ష్మీనారాయణ, వంగా శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొని డా. కె.వి.రమణాచారిని గజమాలలతో ఘనంగా సత్కరిస్తారని వివరించారు. సభకుముందు వివిధరీతుల జానపద కళాకారులచే ఆయా కళాప్రదర్శనలతో ఉర్రూతలూగిస్తారని అధికసంఖ్యలో రమణాచారి ఆత్మీయులు, అభిమానులు, ప్రేమిక అశేష ప్రేక్షకులు, వివిధ కళాకారులు విచ్చేసి ఈ వేడుకల్లో పాల్గొని విజయవంతం చేయాలని సత్యనారాయణ కోరారు.

## రోడ్డు ప్రమాదంలో బిజెపి రాష్ట్ర నేత రాజాగౌడ్ దుర్మరణం

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:** తెలంగాణ ఉద్యమకారుడు, బిజెపి రాష్ట్ర నాయకుడు రంగరాజు గౌడ్(73) శుక్రవారం ఆర్టీసిక్రాస్‌రోడ్స్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించారు. చిక్కడపల్లి పోలీసుస్టేషన్ పరిధిలలో జరిగిన ఈ సంఘటనకు సంబంధించి స్థానిక ఇన్‌స్పెక్టర్ రాజూ నాయక్ తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. కవాడీగూడ ప్రాంతానికి చెందిన బిజెపి రాష్ట్ర నాయకుడు రంగరాజ్‌గౌడ్ చిక్కడపల్లి మెట్రోస్టేషన్ వద్ద అటుగా తన ద్విచక్రవాహనంపై వెడుతున్న రాజాగౌడ్‌ను వెనుకనుంచి వేగంగా వచ్చిన ఆటో ఢీకొట్టడంతో కింద పడడంతో తలకు తీవ్రంగా గాయమైంది. ఆపస్మారకస్థితిలో అతడిని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. చిక్కడపల్లి పోలీసులు కేసును నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు. ఈ ప్రమాదానికి కారణమైన ఆటోడ్రైవర్ కోసం పోలీసులు గాలిస్తున్నారు. బిజెపి కార్యకర్తగా నాయకుడిగా ముషీరాబాద్ నియోజకవర్గం లో ఎన్నో సేవలు చేసిన ఆయన అకాల మృతి పట్ల బిజెపి రాష్ట్ర నాయకులు, నియోజకవర్గం నేతలు ప్రగాఢ సానుభూతిని సంతాపాన్ని తెలిపారు.

## కమ శిక్షణతో చదివితే ఉన్నత శిఖరాలు తథ్యం

**- రాష్ట్ర మైనార్టీ కమిషన్ ఛైర్మన్ తారీఖ్ అన్సారీ**



**చార్మినార్,ఫిబ్రవరి 7 ప్రభాతవార్త :** విద్యార్ధులు కష్టపడి చదివితే తప్పకుండ ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని తెలంగాణ రాష్ట్ర మైనార్టీ కమిషన్ ఛైర్మన్ తారీఖ్ అన్సారీ అన్నారు. పాతబస్తీ కిల్వత్‌లో కాట్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా విచ్చేశారు.కాట్ పోటీ పరీక్షలలో ప్రతిభ కనపరిచిన ఎంఎ ఐడిఎల్ హైస్కూల్‌తో పాటు పలు పాఠశాలలకు చెందిన విద్యార్ధులకు రాష్ట్ర మైనార్టీ కమిషన్ ఛైర్మన్ తారీఖ్ అన్సారీ మెరిట్ సర్టిపికెట్లను అందజేశారు.మలేషియా అంతరిక్ష పరిశోధన కేంద్రం,బెంగుళూరు ఇస్రో సెంటర్,కలకత్తా సైన్సు మ్యూజియంను తిలకించటానికి వెళ్ల నున్న విద్యార్ధులను ఆయన అభినందించారు.కాట్ అకాడమీ డైరెక్టర్ డాక్టర్ మహ్మద్ అన్వర్ మాట్లాడుతూ కాట్ అకాడమీ పోటీ పరీక్షలలో విజయం సాధించిన విద్యార్దులను తమ సొంత ఖర్చులతో అంతరిక్ష పరిశోధన,సైన్సు మ్యూజియంలను తిలకించటానికి తీసుకెళ్లనున్నామని తెలిపారు. కార్యక్రమంలో బహదూర్‌పుర మండలం ఉప విద్యాశాఖాధికారి కె.పోమ్య నాయక్,కాట్ అకాడమీ డైరెక్టర్ మహ్మద్ అన్వర్,ఎంఎ ఐడిఎల్ హైస్కూల్ డైరెక్టర్ మహ్మద్ ఖవిపైదాన్,పాఠశాలల కరస్పాండెంట్లు మహ్మద్ ఉస్మాన్,మహ్మద్ జావిద్,పలు పాఠశాలలకు చెందిన విద్యార్దులు పాల్గొన్నారు.

## బిజెపి జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్‌కు సన్మానం



భరత్‌గౌడ్‌ను సత్కరిస్తున్న అడిక్‌మెట్ డివిజన్ బిజెపి అధ్యక్షుడు పాశం సాయికృష్ణయాదవ్

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:** బిజెపి సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన జి.భరత్‌గౌడ్‌కు శుక్రవారం అడిక్‌మెట్ డివిజన్ బిజెపి అధ్యక్షుడు పాశం సాయి కృష్ణయాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో బిజెపి నేతలు శేషసాయి, ఓంప్రకాష్, కౌండిన్య ప్రసాద్, దర్గానార్సింగరావు, లక్ష్మణరావు, లక్ష్మీనారాయణ, బిఎంఎస్ వెంకటేష్, కిషోర్, జగదీశ్‌గుప్త, నరేష్, మోహన్, ప్రదీప్, జనార్ధనరెడ్డి, చంద్రశేఖర్, వంశీ, శివ, శోభతాకూర్, బాలరాజ్, శేఖర్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రాంతాలలో హరికథలకు ఎంతో ప్రాచుర్యం

**-తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మాధవిదేవి**



బుర్ర సుబ్రహ్మణ్య శర్మ భాగవతార్‌ను సత్కరించిన దృశ్యం

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:**

గ్రామీణ ప్రాంతాలలో హరికథలకు ఎంతో ప్రాచూర్యం లభించేదని, ఆ కళారూపాన్ని బ్రతికించుకోవాలని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మాధవిదేవి అన్నారు. గత ఆరు రోజులుగా నల్ల కుంట లోని శంకరమఠం లో కిన్నెర ఆర్ట్స్ థియేటర్స్ నిర్వహణలో ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కె వి రమణ జన్మదినం సందర్భంలో జరుగుతున్న హరి కథా సప్తాహం శుక్రవారం విజయవంతంగా ముగిసింది. ఏడు రోజులు అధిక సంఖ్యలో ప్రేక్షకులు పాల్గొని హరి కథకులు చెప్పిన కథలు ఆసక్తి గా అలకించారు. చివరి రోజు బుర్ర సుబ్రహ్మణ్య శర్మ భాగవతార్(విజయవాడ) భక్త పోతన కథ గానం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జస్టిస్ టి.మాధవిదేవి పాల్గొని మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాలు లో గతం లో గ్రామీణ ప్రాంతాల సామాన్య ప్రజలు సైతం హరికథలు బుర్రకథలు ఆదరించే వారనీ అన్నారు ప్రస్తుతం ఆ కళాకారులు ఉపాధి అవకాశాలు కోసం ఎదురు చూస్తున్నారు అన్నారు. రమణాచారి పెద్ద మనస్సు తో హరి కథా ప్రక్రియను కాపాడుకోవాలనే తపన తో అవకాశం ఉన్న సమయంలో కళారూపాలను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. వేదిక పై విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కెవి.రమణాచారి మాట్లాడుతూ తన జన్మదినోత్సవాల సందర్భంగా హరికథా మహోత్సవాలను నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా తన జీవితంలో ఎదురైన అంశాలను, పబ్లిక్ సర్వీస్‌కమిషన్ ద్వారా లభించిన ఉద్యోగం, బదిలీలు తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో కిన్నెర సంస్థ స్థాపక కార్యదర్శి మద్దాళి రఘురామ్, కె.కృష్ణారావు, సుబ్బారావు, వెంకటరావు, కామేశ్వరరావు, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు. హరికథాగానానికి వయోలిన్‌పై ధూళిపాల శ్రీనివాసమూర్తి, మృదంగంపై రాయప్రోలు సుధాకర్ వాద్యసహకారాన్ని అందించారు.

### ఘనంగా శ్రీఉజ్జయిని మహంకాళి దేవాలయం పునఃప్రతిష్ఠాపన



ఉజ్జయిని మహంకాళి దేవత విగ్రహ పునః ప్రతిష్ఠాపన పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న బాబు సుదర్శన్, చౌకి రవికుమార్ తదితరులు

**మలక్ పేట ,ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** ఓల్డ్ మలక్ పేట లోని శ్రీ ఉజ్జయిని మహంకాళి దేవాలయం పునః ప్రతిష్ఠాపన పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. దేవాలయంలో పునః ప్రతిష్ఠాపన పూజా కార్యక్రమాలలో భాగంగా ఆవాహిత హోమము, మూలమంత్ర హోమము, అభిషేకము, మంత్ర ప్రతిష్ట, బలి ప్రధానం, అలంకార దర్శనం, పూర్ణాహుతి తదితర పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేసి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయం కమిటీ సభ్యులు బుగుడాల బాబు సుదర్శన్, బాబు శ్రీనివాస్, ఆగమయ్య చౌదరి, చౌకి రవి కుమార్, ఎం. రాజు, పి.టి. శంకర్ ముదిరాజ్, బాబు రాజు, పగిళ్ల నర్సింగ్ పాల్గొన్నారు

## కార్ల అద్దాల బ్లాక్ ఫిలింలను తొలగించాలి

**-ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్ అశోక్ కుమార్**



కార్ల అద్దాల బ్లాక్ ఫిలింలను తొలగిస్తున్న ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్ అశోక్ కుమార్ తదితరులు

**మలక్ పేట ,ఫిబ్రవరి 7, ప్రభాతవార్త :** నగర ట్రాఫిక్ పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మలక్ పేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో కార్ల అద్దాలకు ఏర్పాటు చేసుకున్న బ్లాక్ ఫిలిం తొలగింపు ప్రత్యేక డ్రైవ్ చేపట్టడం జరిగిందని మలక్ పేట ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్ అశోక్ కుమార్ పేర్కొన్నారు. మలక్ పేట్ ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్ అశోక్ కుమార్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మలక్ పేట , చాదర్ ఘాట్ తదితర ప్రాంతాలలో ఎస్ఐలు సిబ్బందితో కలిసి ఆయన కార్ల అద్దాలకు ఏర్పాటు చేసుకున్న బ్లాక్ ఫిలింలను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిఐపిలకు మాత్రమే బ్లాక్ ఫిలిం వాడటానికి అనుమతి ఉందని తెలిపారు. బ్లాక్ ఫిలిం కలిగిన వాహనదారులు వెంటనే తొలగించుకోవాలని సూచించారు. పోలీసుల డ్రైవ్ లో పట్టుపడితే బ్లాక్ ఫిల్లింగ్ తొలగించడంతోపాటు జరిమానా విధించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఐ రాము, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వేగవంతంగా అభివృద్ధి పనులు చేపట్టాలి

**- ఎమ్మెల్యే అహ్మద్ బలాల**



జిహెచ్ఎంసి అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అహ్మద్ బలాల

**మలక్ పేట ,ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** మలక్ పేట్ నియోజకవర్గంలో పెండింగ్ లో ఉన్న అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని నియోజకవర్గం ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. నియోజకవర్గంలో ఉన్న పెండింగ్ లో ఉన్న పనులపై జిహెచ్ఎంసి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. రానున్న రంజాన్ పండుగ సందర్భంగా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. నూతన అభివృద్ధి పనులను చేపట్టడానికి ప్రణాళికలను రూపొందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇఇ పిర్ సింగ్ , ఎఇ లు మల్లికార్జున్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## జోనల్ కమిషనర్‌ను కలిసిన కార్పొరేటర్



జోనల్ కమిషనర్ కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ సుజాత నాయక్.

**వనస్థలిపురం. ఫిబ్రవరి.7.ప్రభాతవార్త :** ఎస్ ఎన్ డి పి నిధులతో మంజూరైన నాలా పనులను వెంటనే చేపట్టాలని ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ ను కోరినట్లు హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ తెలిపారు. శుక్రవారం జోనల్ కమిషనర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి విన్నవించినట్లు తెలిపారు. ఎస్ ఎన్ డి పి నిధులు 12:30 కోట్లు మంజూరయ్యావని ఏపీ ఎస్ సి బి కాలనీ నుండి బైరామాల గూడ చెరువు వరకు పనులు చేపట్టాలని కోరారు. వర్షాకాలం రాకముందే పనులు పూర్తయితే ఆయా ప్రాంతాల వారు వరద నీటితో ఇబ్బందులు పడరని వెంటనే అట్టి పనులు ప్రారంభించి పూర్తి చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన జోనల్ కమిషనర్ వెంటనే అట్టి పనులు ప్రారంభించే విధంగా చొరవ తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. దీంతోపాటు డివిజన్లో పలు సమస్యలను పరిష్కరించే విధంగా నిధులు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు.

## కాపు సంఘం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



**వనస్థలిపురం. ఫిబ్రవరి.7.ప్రభాతవార్త :** ఎన్జీవో కాలనీ కాపు భవనంలో వనస్థలిపురం కాపు సంఘం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచిత కంటి పరీక్షలు, ఆపరేషన్, కళ్ళాధాలు, దంత పరీక్షలు, బీపీ షుగర్ పరీక్షలు, ఉచిత మందులను పీస్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ బొగ్గు సురేష్ మరియు వారి మెడికల్ సిబ్బంది సహకారంతో అందించారు. ఈ కార్యక్రమంలో వనస్థలిపురం కాపు సంఘం అధ్యక్షుడు ఐ ఎస్ కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఎం పున్నయ్య, కోశాధికారి ఎన్ రత్నారావు ,స్ఫూర్తి సేవా సమితి అధ్యక్షుడు కొలిశెట్టి సంజయ్ కుమార్, ఉచిత వైద్య శిబిరం పర్యవేక్షణ కమిటీ సభ్యులు తోట హనుమంతరావు, వివి సత్యనారాయణ, ఎస్ వెంకటేశ్వరరావు, పి ఎల్ నరసింహ, సిహెచ్ ప్రసాద్, ఎస్ శ్రీనివాసరావు, ఆంజనేయులు, సత్తిబాబు, నరేందర్, సాయికుమార్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

# పదవిలో ఉన్నలేకున్నా ప్రజల కోసం పని చేస్తా : మధుయాష్కీ గౌడ్.



కార్యక్రమంలో మాట్లాడుతున్న మధుయాష్కీ గౌడ్.

**వనస్థలిపురం. ఫిబ్రవరి.7. ప్రభాతవార్త :** పదవిలో ఉన్నా, లేకున్నా ప్రజలకోసం పనిచేసి, ఎల్.బి. నగర్ నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని టి.పి.సి.సి. ప్రచార కమిటీ చైర్మన్ మాజీ. ఎం. పి.మధుయాష్కీ గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర రెడ్డితో కలిసి డివిజన్ పరిధిలోని మల్లికార్జున నగర్,క్రిస్టియన్ కాలనీ,న్యూ వెంకటరమణ కాలనీలలో పర్యటించి ఆయా కాలనీలలో జరిగిన అభివృద్ధి పనులు,సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం న్యూ వెంకటరమణ కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత బి.ఆర్. ఎస్. ప్రభుత్వంలో అధికారులు అవినీతికి పాల్పడి అక్రమ నిర్మాణాలను,సెల్లార్ లకు అనుమతులు ఇచ్చారని,దీంతో ప్రమాదాలు జరిగి పేద కూలీలు ప్రాణాలు కోల్పోయారని ఆరోపించారు. ఇక మీదట అధికారాలు ఒళ్ళు దగ్గర పెట్టుకొని పనిచేయాలని సూచించారు. వనస్థలిపురంలో కార్పొరేటర్ వెంకటేశ్వర రెడ్డి కాంగ్రెస్ పార్టీ లో కి వచ్చిన తర్వాత డివిజన్ లో 8 కోట్ల రూపాయల తో అభివృద్ధి పనులు జరగడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ సహకారంతో మిగిలిన అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయిస్తానని హామీనిచ్చారు. కార్పొరేటర్ వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ త్వరలో జిల్లా ఇంచార్జి మంత్రి శ్రీధర్ బాబు తో ,మధుయాష్కీ గౌడ్ సహకారంతో అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేస్తామన్నారు. అనంతరం ఎన్. జి.ఓ.కాలనీలోని గ్రంథాలయ ప్రాంతాన్ని మధుయాష్కీ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సేవాదల్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్, నాయకులు కుట్ల నర్సింహా యాదవ్, మకుటం సదాశివుడు,మార్కెట్ కమిటీ డైరెక్టర్లు అశోక్ గౌడ్,నెలపాటి రామారావు, సామ మహేశ్వర రెడ్డి,శశిధర్ రెడ్డి,చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం బ్రహ్మోత్సవాలు



శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి బ్రహ్మోత్స వాల్లో భాగంగా పూజలు నిర్వహిస్తున్న ఆలయ కమిటి నేతలు

**రామంతాపూర్, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త :** రామంతాపూర్‌లోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం 37వ బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి ఘనంగా ప్రారంభం అయ్యాయి. శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం ట్రస్ట్, ఆర్యవైశ్య సంఘం చైర్మన్ గంజి రాజమౌళిగుప్త, అధ్యక్షుడు బోనగిరి శ్రీనివాసులుగుప్త, కోశాధికారి పూరే నగేష్‌గుప్త, సహాయ ప్రధాన కార్యదర్శి యెనిశెట్టి కొండయ్యగుప్త, కొత్తపల్లి రమేష్‌గుప్త, పల్లెర్ల బిక్షపతిగుప్త, బోనగిరి శ్రవన్‌కుమార్‌గుప్త, జిల్లా హరిబాబుగుప్త, దారం వెంకటేష్‌గుప్త, విశ్వనాథ మంజునాథగుప్త, బెజగం రాజుగుప్త, మంచాల వీర ప్రకాష్‌గుప్త, బురుగు రమేష్‌గుప్త, మహిళా విభాగం అధ్యక్షురాలు సంబు జయమ్మ, బోనగిరి పద్మ, విశ్వనాథ సుజాత తదితరుల ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆలయంలో సుప్రభాతం, మూత దేవతల అలంకారము, అభిషేకం, నిత్య పూజ నిర్వహించారు. గంజిరాజమౌళిగుప్త, అమృతమ్మ దంపతులతో విఘ్నేశ్వర పూజ, స్వస్తివాచనము, ఋత్విగ్వరణము, కలశస్థాపన, అంకురార్పణము, ధ్వజారోహణము, బేరి పూజ, శివాభిషేకం, అన్నప్రసాద వితరణ నిర్వహించారు. సాయంత్రం ప్రదోష పూజ, హారతి, మంత్ర పుష్పము ఉ, తీర్థప్రసాద వితరణ నిర్వహించారు. శనివారం ఉదయం శ్రీ పార్వతి పరమేశ్వరుల కల్యాణం, సీతారామచంద్ర స్వామి కల్యాణోత్సవం ఉంటుందని తెలిపారు. ఈనెల 9వ తేదిన సుప్రభాతం, నిత్య పూజ, రుద్రాభిషేకం, అర్చన, అలంకారములు, చండీ హోమం, బలిహారణము, పూర్ణాహుతి, కలశోధ్వాసన, మహానివేదన, మంత్రపుష్పం, మహద్వాశీర్వచనము ఉంటుందని తెలిపారు. ఉత్సవాల సందర్భంగా ఆలయంలో శుక్రవారం కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ ప్రధాన పూజారి రేపాక కళానిది శర్మ, శ్రీనివాసాచార్యులు, జితేంద్రశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నేటి నుంచి మూడు రోజుల పాటు ఉత్సవాలు జరుగుతా యని నిర్వహకులు తెలిపారు.కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

# మూడు నిండు ప్రాణాలకు రూ.50 లక్షలు?

**-ఎవరిది పాపం?**
**ఎవరికి శిక్ష?**
**-ముడుపుల మత్తులో టౌన్ ప్లానింగ్**
**-తప్పనిసరి పరిస్థితుల్లో కూల్చివేతలు**





స్లాబ్ కూల్చి వేస్తున్న దృశ్యం, సెల్లార్ తవ్వకాలు జరుపుకున్న దృశ్యం

**ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:** ముగ్గురి నిండు ప్రాణాలకు వెలకట్టారు. నిబంధనలను ఉల్లంఘించి చేస్తున్న పనులతో ముగ్గురు అమాయక కార్మికుల ప్రాణాలు గాల్లో కలిశాయి. టౌన్ ప్లానింగ్ అధికారుల చేతివాటానికి ఈ సంఘటన నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తుంది. ఎల్బీనగర్ నియోజకవర్గం మన్సూరాబాద్ లో ఈ నెల 5వ తేదీన భవన నిర్మాణానికి సంబంధించి సెల్లార్ తవ్వకాలు జరుపుతుండగా జరిగిన సంఘటనలో అక్కడ పనిచేస్తున్న ముగ్గురు కార్మికుల నిండు ప్రాణాలు పోయాయి. చేతివాటాన్ని ప్రదర్శించిన టౌన్ ప్లానింగ్ అధికారులు అనుమతులు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. సెల్లార్ తవ్వకాలు జరుగుతున్న సమయంలో పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు అటువైపు తొంగి చూడలేదు. భవన నిర్మాణానికి సంబంధించి సెల్లార్ తవ్వకాలు జరుగుతున్న సమయంలో మట్టిగడ్డలు కులడంతో ముగ్గురు మరణించగా ఒకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. జరిగిన సంఘటనకు ఎవరు బాధ్యత వహిస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు. అయితే పనులు జరుగుతుండగా సెల్లార్ కూలడంతో మరణించిన కార్మికులకు రూ.50 లక్షలు ఇచ్చేందుకు నిర్మాణదారులు ఒప్పందం కుదుర్చుకున్నట్టు విశ్వసనీయ సమాచారం. అదేవిధంగా ఇద్దరు బిల్డర్లపై ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు అయింది. ఈ సంఘటన జరగడంతో జిహెచ్ఎంసి టౌన్ ప్లానింగ్ అధికారులు అప్రమత్తమయ్యారు. వెంటనే హడావిడి చేస్తూ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాలలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్న భవన నిర్మాణాల స్లాబ్ లను కూల్చివేసే పనిలో నిమగ్నమయ్యారు. ఆరు నెలల నుంచి ఏడాదికిపైగా భవన నిర్మాణాలు జరుగుతుంటే కళ్ళు మూసుకున్న అధికారులు మన్సూరాబాద్ సంఘటనతో తప్పేది లేక యాక్షన్ లోకి దిగారు. ఎటువంటి నోటీసులు ఇవ్వకుండానే అక్రమ నిర్మాణాలు అంటూ కూల్చివేత పనిలో నిమగ్నమయ్యారు. అనుమతి ఇచ్చిన సమయంలో ముడుపులు ముట్టినప్పటికీ మన సురాబాద్ ఘటనతో తప్పనిసరి పరిస్థితుల్లో అక్రమ నిర్మాణాలను కూల్చివేయడం తప్పడం లేదని అధికారులు తల పట్టుకుంటున్నారు. ముడుపులు ముట్టిన తర్వాత నిర్మాణాలు ఎలా కూల్చివేస్తారంటూ సదరు నిర్మాణదారులు అధికారులతో గొడవ పెట్టుకుంటున్నారు. హయత్ నగర్, సరూర్ నగర్, ఎల్బీనగర్ సర్కిల్ పరిధిలో వేలాది అక్రమ నిర్మాణాలు జరుగుతున్నప్పటికీ, చర్యలు తీసుకోవాలని అనేక ఫిర్యాదులు వచ్చిన చర్యలు చేపట్టలేదు. కానీ ఇప్పుడు అధికారులకు కూల్చీ వేతలు తప్పడం లేదు. ఇప్పటికైనా జిహెచ్ఎంసి ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

## ఉప్పల్ డిగ్రీ కళాశాలలో అవర్తన పట్టిక దినోత్సవం



ఉప్పల్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ అవర్తన పట్టిక దినోత్స వంలో పాల్గొన్న ప్రిన్సిపల్ డా.విజయ్‌కుమార్ తదితరులు

**ఉప్పల్, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త :** ఉప్పల్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ అవర్తన పట్టిక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అవర్తన పట్టిక పితామహుడు దిమిత్రి మెండలీఫ్ సేవలను ప్రిన్సిపల్ డా.కె.విజయ్ కుమార్ కొనియాడారు. అవర్తన పట్టిక రసాయన మూలకాలను ఒక అమరిక అని ఆయన పేర్కొన్నారు. అవర్తన పట్టికలో కొన్ని మూలకాల రసాయన ధర్మాలను వివరించారు. రసాయన శాస్త్ర విభాగాధిపతి సహాయ చార్యులు కె.గీత, జి.శ్రీదేవి ఆధ్వర్యలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డా.ఎ.రవిప్రసాద్, డా.ఆర్.చంద్రసాగర్ తదితరులు పాల్గొన్నారు.

## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న కార్పొరేటర్ బన్నాల గీత



తిరుమల శ్రీవారిని దర్శించుకున్న కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ తదితరులు

**ఉప్పల్, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త :** తిరుమల శ్రీవారిని శుక్రవారం చిలుకానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో బన్నాల గీత ప్రవీణ్ మాట్లాడుతూ తిరుమల శ్రీవారి దయతో చిలుకానగర్ డివిజన్ ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. మాజీ సిఎం కెసిఆర్, కెటిఆర్, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రజలందరూ ఆనందోత్సవాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సోదరి వాణి, సాయిరామకృష్ణ, అక్షయ్ తదితరులు పాల్గొన్నారు.

### అభివృద్ధి పనులకు నిధులు కేటాయించండి



జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి

**సైదాబాద్, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:** ఐఎస్ సదన్ డివిజన్‌లో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి శుక్రవారం జోనల్ కమీషనర్ వెంకన్నకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ జంగం శ్వేత మాట్లాడుతూ డివిజన్‌లో వివిధ అభివృద్ధి పనులు చేపట్టడానికి ఒక కోటి అరవయి ఎనిమిది లక్షల రూపాయలు మంజూరు చేయాలని జోనల్ కమీషనర్‌ను కోరడం జరిగిందన్నారు. యాకుత్‌పుర నియోజకవర్గంలో ఐఎస్ సదన్ డివిజన్ నుంచి అత్యధిక టాక్స్‌ను కడుతున్నప్పటికీ అభివృద్ధి పనులకు నిధులను మంజూరు చేయడంలో మాత్రం అధికారులు డివిజన్ మీద పక్షపాతం చూపిస్తున్నారని అన్నారు. గత 18 నెలలుగా డివిజన్‌కు ఎలాంటి నిధులు కేటాయించకపోవడం అధికారుల పనితీరుకు నిదర్శనంగా నిలుస్తుందని కార్పొరేటర్ విమర్శించారు.అధికారులు ఇప్పటికైనా స్పందించి అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని కోరారు.

### ఉదయ్‌నగర్ కాలనీలో మధుయాష్కీ పర్యటన



ఉదయ్‌నగర్ కాలనీలో పర్యటిస్తున్న మాజీ ఎంపి మధుయాష్కీ

**సైదాబాద్, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:** చంపాపేట డివిజన్ ఉదయ్‌నగర్ కాలనీలో టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్, మాజీ పార్లమెంటు సభ్యులు మధుయాష్కీ గౌడ్ శుక్రవారం పర్యటించారు. కాలనీలో వరదనీటి కాలువ పనులు అసంపూర్తిగా ఉండడంతో తాము ఇబ్బందులకు గురవుతున్నామని కాలనీవాసులు మధుయాష్కీ దృష్టికి తేగా నాలాను పరిశీలించిన ఆయన ఎస్ఎన్‌డిపి డిఇతో మాట్లాడి నాలా నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేయాలని సూచించారు. వర్షాకాలంలో సమస్యలు తలెత్తకుండా పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. కాలనీలోని ఖాళీ స్థలం ఆకతాయిలకు అడ్డాగా మారిందని స్థానికులు ఫిర్యాదు చేయడంతో సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్‌తో మాట్లాడి కాలనీలో గస్తీని పెంచాలని, కాలనీవాసులను ఇబ్బందులకు గురిచేసే వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

### డివిజన్ సమస్యల పరిష్కారం కోసం జెడ్‌సీకి కార్పొరేటర్ వినతి



జోనల్ కమీషనర్ హేమంత్ కేశవ్ పాటిలక్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్

**నాచారం, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:** నాచారం డివిజన్ పరిధిలోని పలు సమస్యలపై ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ పాటిల్ ను నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ కలిసి నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. పెండింగ్ లో ఉన్న అభివృద్ధి పనుల నిమిత్తం నిధులు మంజూరు చేయాలని జరిగింది. ప్రధానంగా నాచారం ఓల్డ్ విలేజ్లో ఇప్పటివరకు రూ. 54 లక్షల రూపాయల వ్యయంతో సిమెంట్ రోడ్లు వేయడం జరిగిందని, ఇంకా మిగిలిన రోడ్లకు సంబంధించి నిధులు మంజూరు చేయాలని కోరారు. అలాగే పలు కాలనీలలో భూగర్భ డ్రైనేజీలు నిర్మించడం వల్ల పాడైన రోడ్ల స్థానంలో కొత్త సిమెంట్ రోడ్లు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే సుమారు కోటి యాభై లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన వార్డ్ కార్యాలయానికి లిఫ్ట్ సౌకర్యం లేక ప్రారంభోత్సవం చేయలేకపోతున్నామన్నారు. లిఫ్ట్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన జోనల్ కమిషనర్ ముందుగా నాచారం ఓల్డ్ విలేజ్ లో మిగిలిన సిమెంట్ రోడ్లకు నిధులు మంజూరు చేస్తానని హామీ ఇవ్వడం జరిగిందని కార్పొరేటర్ చెప్పారు.

## మహిళా ట్రాఫిక్ కానిస్టేబుల్‌తో అసభ్యంగా ప్రవర్తన

**-యువకుడికి 14 రోజుల రిమాండ్**



పోలీసుల అదుపులో నిందితుడు

**తార్నాక, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:** విధులు నిర్వర్తిస్తున్న అధికారులపై సమాజం గౌరవప్రదంగా నడుచుకోవాలి. రాత్రనక పగలనక ప్రజల సేవలోనే నిమగ్నమయ్యే ప్రతినిధులపై అసభ్యకరంగా ప్రవర్తిస్తే ఎంతటి వారికైనా శిక్ష తప్పదు.అలాంటి సంఘటనే ఒకటి తాజాగా వెలుగులోకి వచ్చింది. ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న ఓ మహిళా ట్రాఫిక్ కానిస్టేబుల్ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు ఓ ప్రబుద్ధుడు. ఇంకేముంది.. కట్ చేస్తే.. కేసు నమోదు కావడంతో పాటు కోర్టు మెట్లు కూడా ఎక్కాడు.హైదరాబాద్ మహానగరంలోని తార్నాకలో ట్రాఫిక్ డ్యూటీ నిర్వహిస్తున్న నల్లకుంట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో విదులు నిర్వహించే మహిళా ట్రాఫిక్ కానిస్టేబుల్‌తో అసభ్యకరంగా ప్రవర్తించాడు పృథ్వీరాజ్ అనే వ్యక్తి. మహిళా ట్రాఫిక్ కానిస్టేబుల్ తన విధుల్లో తాను బాధ్యతాయుతంగా ఉండగా.. ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఆ వ్యక్తి మధ్య వేలు చూపిస్తూ.. చేతితో అసభ్యకరంగా సైగలు చేశాడు. దీంతో ఆమె ఫిర్యాదుతో అతనిని ఉస్మానియా యూనివర్సిటీ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

# ఉప్పల్‌లో పుట్‌పాత్‌లపై ఆక్రమణలు తొలగింపు : కమిషనర్



ఉప్పల్‌లో పుట్‌పాత్ ఆక్రమణలను తొలగిస్తున్న మున్సిపల్ అధికారులు దృశ్యం.

**ఉప్పల్, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త :** ఉప్పల్ సర్కిల్ పరిధిలో పుట్‌పాత్ ఆక్రమణలు తొలగించేందుకు స్పెషల్ డ్రైవ్ చేపట్టినట్లు డిప్యూటి కమిషనర్ అంజనేయులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఉప్పల్ సర్కిల్ పరిధిలోని చిలుకానగర్, బ్యాంక్‌కాలనీ, ఉప్పల్ ప్రధాన రహదారిలోని పలు పుట్‌పాత్ ఆక్రమణలను తొలగించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు, పాదచారులకు ఇబ్బంది కలిగించే విధంగా పుట్‌పాత్‌లపై వ్యాపారాలు చేయవద్దని సూచించారు. పక్కగా నిర్మించిన కట్టడాలు పూర్తిగా తొలగిస్తామని తెలిపారు. రోడ్డు ఆక్రమణలపై అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నామని తెలిపారు. కాగా బ్యాంక్ కాలనీ పార్కు వద్ద నిర్మించిన పాల బూత్ తొలగించడంపై ఒక మహిళ అధికారులపై అగ్రహం వ్యక్తం చేసింది. కొన్ని సంవత్సరాలుగా ఇక్కడ ఉంటున్నానని, తన దుకాణం తొలగించడం సబబు కాదని పేర్కొంది. ఈ కార్యక్రమంలో టిపిఎస్ సురేష్, రాజు, లక్ష్మణ్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

### అర్హత మించిన వైద్యం చేయరాదు : ఉక్కుల అశోక్

**తుర్కయంజాల్ ఫిబ్రవరి 7(ప్రభాతవార్త)** తెలంగాణ కమ్యూనిటీ పారామెడిక్ వైద్యుల ఐక్య వేదిక రాష్ట్ర కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్టంలో ఉన్న అన్ని జిల్లాల మండలాలలో ఉన్నటువంటి అధ్యక్షులు నకిలి వైద్యులను గుర్తించి వచ్చి రాని వైద్యం చేస్తూ పెదప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న , ఆర్.ఎం.పి, పి ఎం పి, ల పేరుతో నకిలీలను గుర్తించి ఆర్.ఎం.పి, పి ఎం పి,సంఘ నాయకులకు గాని ప్రభుత్వ అధికారులకు తెలియచేసి వారిని అరికట్టాలి అన్ని మీతి మీరి వైద్యం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఉక్కుల అశోక్ అధికారులను కోరున్నారు ఆర్ఎంపి, పి.ఎం.పి, లు ప్రథమ చికిత్స మాత్రమే చేసుకొని జీవనోపాధి గడపాలని అన్నారు లేనియెడల ప్రభుత్వం వాళ్లపై కఠిన చర్యలు తీసుకుంటారని వారు తెలియజేశారు

## లక్ష్మీ వేంకటేశ్వర స్వామికి స్వర్ణ యజ్ఞోపవీతం బహుకరణ



**మల్కాజిగిరి ఫిబ్రవరి7,ప్రభాతవార్త :** మల్కాజ్ గిరి గౌతం నగర్ కి చెంది న్యాయవాది రేఖ శ్రీనివాస్ ఆనంద్ బాగ్ శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి వారికి స్వర్ణ యజ్ఞోపవీతాన్ని శుక్రవారం స్వామివారికి సమర్పించినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి ఎ బి రవీంద్ర రెడ్డి తెలిపారు.శుక్రవారం అభిషేకం, అర్చన చేసి స్వామి వారికి యజ్ఞోపవీతాన్ని ఆలయ ప్రధానార్చకులు ముదుంబై వేంకట రమణా చార్యులు స్వామివారికి అలంకరించారు.బంగారు యజ్ఞోపవీతం 49 గ్రాముల 940 మిల్లి గ్రాముల బరువు ఉన్నదని ఆలయ కార్యనిర్వహణ అధికారి తెలిపారు.ఈకార్యక్రమంలో ఆలయ అర్చకులు తులసి వెంకట రమణా చార్యులు,ఆలయ జూనియర్ అసిస్టెంట్ సంద్ర సుధాకర్ , భక్తులు జోగేశ్వర్ కుమార్ , సంజయ్ గుప్తా, కామేశ్వర రావు, రాజ్యలక్ష్మీ దేవి ,లావణ్య సుధాకర్, జయశ్రీ సుధారాణి, రేఖ , భాను తదితర భక్తులు పాల్గొన్నారు.

### సూపర్‌సక్కర్‌తో ట్రంక్ లైన్ క్లీనింగ్ పనులు

**- రజిత పరమేశ్వర్‌రెడ్డి**



సూపర్ సక్కర్‌తో ట్రంక్ లైన్ క్లీనింగ్ పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ ఎం.రజిత పరమేశ్వర్‌రెడ్డి, సిజిఎం సుజాత తదితరులు

**ఉప్పల్, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త :** ఉప్పల్ సర్కిల్‌లో రూ.8 కోట్ల వ్యయంతో సూపర్ సక్కర్‌తో చేపట్టిన ట్రంక్ లైన్ క్లీనింగ్ పనులను శుక్రవారం స్థానిక కార్పొరేటర్ మందముల రజిత పరమేశ్వర్‌రెడ్డి, జలమండలి సిజిఎం సుజాత, కాంగ్రెస్ ఇంచార్జీ మందముల పరమేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా రామంతాపూర్ నుంచి ఉప్పల్ నల్ల చెరువు వరకు ఉన్న ఎస్టీపీకి వచ్చే ట్రంక్ లైన్ క్లీనింగ్ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎం.రజిత పరమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ట్రంక్ లైన్ క్లీనింగ్ చేయకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత సిఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని ట్రంక్ లైన్ క్లీనింగ్ పనులు చేపట్టినట్లు తెలిపారు. ఉప్పల్ సర్కిల్‌లో పనులు వేగంగా జరుగుతున్నాయని, ఇదే తరహాలో మిగతా ప్రాంతాల్లో కూడా పనులు చేపట్టనున్నట్లు సిజిఎం సుజాత తెలిపారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా తగు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిఎం సంతోష్, డిజిఎం రజనీకాంత్‌రెడ్డి, కాలనీ నేతలు పసుల లుకాస్, నాగేశ్వర్‌రావు, సల్ల ప్రభాకర్‌రెడ్డి, మధుబాబు, సందీప్, భాస్కర్, సురేందర్‌రెడ్డి, బ్రహ్మాచారి, సుధాకర్, అశోక్‌గౌడ్, నారాయణ, శేఖర్ మేస్త్రీ, శంకరయ్య, రమణారెడ్డి, విజయ్, అచ్చిరెడ్డి, యాదగిరి, రాములు పాల్గొన్నారు.

### ఈవీఎం గోడౌన్‌ను సందర్శించిన జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి



**అత్తాపూర్ ఫిబ్రవరి7,ప్రభాతవార్త :** రాజేందర్‌నగర్‌లో గల ఈవీఎం గోడౌన్ ను జిల్లాకలెక్టర్ సి.నారాయణ రెడ్డి శుక్రవారం సందర్శించారు. సాధారణ పరిశీలన ప్రక్రియలో భాగంగా క్షేత్ర స్థాయి సందర్శన జరిపారు.ఈవీఎం గోడౌన్ కు వేసిన సీళ్లను పరిశీలించి, బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వివి.ప్యాట్లు, ఇతర ఎన్నికల సామాగ్రిని భద్రపరిచిన తీరును తనిఖీ చేశారు. ఈవీఎం గోడౌన్ వద్ద పోలీసు బందోబస్తు తీరును పరిశీలించారు.కలెక్టర్ వెంట ఆర్డీఓ వెంకట్ రెడ్డి,తహసీల్దార్ రాములు, ఎన్నికల విభాగం అధికారులు,తదితరులు ఉన్నారు.